రూ.4.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.1,600

ఒంగోలులో పార్టీ కార్యాలయం నిర్మాణంలో వైసీపీ అడ్డగోలు వ్యవహారం

వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఐదేళ్లు సాగించిన అడ్డగోలు వ్యవహారాలు బయటపడుతున్నాయి. జగన్ పాలనలో ఆయన కోసం తాడేపల్లి ప్యాలెస్, రుషికొండ ప్యాలెస్‌లు కట్టేసి ప్రజాధనం దుర్వినియోగం చేయగా.. పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం ఒంగోలులో వైసీపీ నేతలు మరింత బరి తెగించారు. వారి ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గారు. రూ.కోట్ల విలువైన 1.64 ఎకరాల భూమిని కారుచౌకగా లీజుకు కట్టబెట్టారు. పన్నుల చెల్లింపు నుంచి ప్లాన్ అనుమతి వరకూ మున్సిపల్ ఉన్నతాధికారులు నిబంధనలు సైతం సడలించి స్వామిభక్తిని చాటుకున్నారు. ఇటు పన్ను, అటు ప్లాన్ అనుమతికి భారీ రాయితీలు ఇచ్చారు. అయినప్పటికీ వైసీపీ నేతలు తమ వక్రబుద్ధిని ప్రదర్శించారు. నిర్మాణాలకు అనుమతి వచ్చినప్పటి నుంచి పైసా పన్ను చెల్లించకపోవడంతో రూ.14.35లక్షల బకాయి పేరుకుపోయింది. అయినప్పటికీ ఆ కార్యాలయం వద్ద మునిసిపల్ అధికారులు ఆరు కొళాయిలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.


నూతనంగా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయం

గలీజు




- అధికారుల సంపూర్ణ సహకారం
- ఖాళీ స్థలానికి పన్ను విషయంలో నిబంధనలు సడలింపు
- భవన నిర్మాణానికి అనుమతులు వచ్చిన తర్వాత పైసా చెల్లించని ఆపార్టీ నేతలు
- ఇప్పటి వరకూ రూ.14.35లక్షల బకాయి
- అక్రమంగా కొళాయిలు వేసి స్వామి భక్తిని చాటుకున్న కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 23 : జగన్ ప్రభుత్వం చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఐదేళ్లపాటు అవకాశం ఉన్నచోటల్లా ఇష్టారాజ్యంగా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడిన వైసీపీ పెద్దలు.. పార్టీ కార్యాలయ నిర్మాణంలోనూ అవకతవకలకు ఒడిగట్టారు. ఒంగోలులో అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ స్థలాలను సొంత పార్టీ కార్యాలయానికి మార్చుకోవడమే కాకుండా, కార్యాలయ భవనం పన్ను విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారు. అధికార పార్టీ ఆదేశాలకు ప్రభుత్వ అధికారులు సైతం తలూపారు. నగరంలోని దక్షిణ బైపాస్ (ఎన్నెస్పీ కార్యాలయం పక్కన) సర్వే నెం.17లోని ప్రభుత్వ స్థలంలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణంలో అడ్డగోలు వ్యవహారమే నడిచింది. అటు రెవెన్యూ, ఇటు కార్పొరేషన్ అధికారులు సైతం సహకరించారు. సుమారు 7,934 చదరపు గజాల(1.64ఎకరాల) ఎన్నెస్పీ భూమిని రెవెన్యూ అధికారులు వైసీపీకి అప్పనంగా కట్టబెట్టారు. వైసీపీ కార్యాలయానికి కేటాయించిన ఈ భూమి విలువ సుమారు రూ.4.50 కోట్లు ఉంటుంది. ఏడాదికి ఎకరాకు రూ.1000 అద్దె ప్రకారం 33 ఏళ్ల లీజుకు రాసిచ్చారు. జె.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరున ఫైలును నడిపారు. కార్యాలయానికి భూమి కేటాయింపు అనంతరం జరిగిన తతంగంలో అంతా అక్రమాలే జరిగినట్లు తెలుస్తోంది.

పన్ను విషయంలో అవకతవకలు

ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపట్టాలంటే జీవో ప్రకారం మొదటిసారే ఏడు వాయిదాలు ఖాళీ స్థలం పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించాలి. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత యూసేజ్ సర్టిఫికెట్ పొందుపరిచి పన్ను తగ్గించుకోవాల్సి ఉంటుంది. అయితే వైసీపీ కార్యాలయ నిర్మాణం విషయంలో అప్పటి పురపాలక శాఖ రాష్ట్ర అధికారులే కథ నడిపించారు. నేరుగా డీఎంఏ కార్యాలయం జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ప్లాన్ పొందాలంటే పన్ను రశీదు పొందుపరచాల్సి ఉంది. అందుకోసం ఒకేసారి ఏడు వాయిదాల వీఎల్‌టీ చెల్లించాలి. ఈ నేపథ్యంలో డీఎంఏ కార్యాలయం నిబంధనలను సైతం సడలించి వైసీపీ కార్యాలయానికి లీజుకు తీసుకున్న భూమికి ఒక వాయిదా పన్ను చెల్లించేలా వెసులుబాటు ఇచ్చింది. అందుకు ఆన్‌లైన్‌లో అవసరమైన మార్పులు చేసినట్లు సమాచారం. పార్టీ పెద్దల ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలానికి పన్ను ఒక వాయిదాకి రూ.3,42,904 విధించి, అసెస్‌మెంట్ నెం.10350652250 కేటాయించారు.


కుళాయిలకు మోటార్లు బిగించి నీటి తోడకం

రూ.14.35లక్షల పన్ను బకాయి

జిల్లా వైసీపీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి జె.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరున ఫైలును నడిపారు. ఎన్నెస్పీకి చెందిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు వైసీపీ పెద్దలకు కట్టబెట్టగా, నిర్మాణ పనులకు కార్పొరేషన్ కార్యాలయ అధికారులు సహకరించారు. 24/12/2022న సుమారు 1.64 సెంట్ల భూమికి కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలం పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) విధించారు. ఒక వాయిదాకి రూ.3,42,904 చెల్లించాల్సి ఉండగా ప్లాన్ కోసం డీఎంఏ ఇచ్చిన వెసులుబాటు ప్రకారం ఒక వాయిదా చెల్లించారు. అనంతరం భవన నిర్మాణానికి అనుమతులు పొందారు. ఆ తర్వాత అసలు పన్ను చెల్లించడం మానేశారు. దీంతో ఇప్పటి వరకు రూ.14,35,060 బకాయి పెండింగ్‌లో ఉంది. కార్పొరేషన్ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలోనే గండిపడింది.

అనుమతుల్లేకుండా కొళాయిలు

సామాన్యులు తాగునీటి కొళాయి కావాలంటే అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టే అధికారులు వైసీపీ పెద్దల మెప్పు కోసం స్వామి భక్తిని చాటుకున్నారు. ఖాళీ స్థలంగా ఉండగానే, పన్ను బకాయిలు పేరుకుపోయినప్పటికీ వైసీపీ జిల్లా కార్యాలయానికి సుమారు ఐదు వరకు అక్రమ కొళాయిలు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ఇంటి పన్ను రశీదు పొందాక కొళాయికి దరఖాస్తు చేసుకుంటే వర్క్ ఆర్డరు ఇవ్వాలి. 'అధికారం మాదే.. అడిగేవారు ఎవరు' అన్నట్లు వైసీపీ పెద్దలు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఏకంగా ఐదు కొళాయిలు వేసేశారు.


కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యం
- విస్తృతంగా ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు
- 'ఆంధ్రజ్యోతి'తో నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తానని నూతన కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా చెప్పారు. అదేసమయంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతకు కూడా ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఇక ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కర్తవ్యమన్నారు. జిల్లాకు 38వ కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా ప్రస్తుతం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తన ప్రాధాన్యతలను వివరించారు. తమిళనాడుకు చెందిన తమీమ్ అన్సారియా 2015 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. చెన్నైలో బీఈ కంప్యూటర్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆమె తొలుత 2013లో సివిల్స్ గ్రూప్ ఏ గ్రేడ్‌లో అకౌంటెన్సీ పోస్టు సాధించి కేంద్ర ప్రభుత్వంలో పనిచేశారు. 2015లో ఐఏఎస్‌గా ఎంపికైన ఆమెను యూపీ కేడర్‌కు కేటాయించారు. కొంతకాలం కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ సెక్రటరీగా కూడా పనిచేశారు. కాగా ఆంధ్ర కేడర్‌లో పనిచేస్తున్న జమ్మూకశ్మీర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి మునజీర్ జిలానీతో వివాహం అనంతరం తమీమ్ అన్సారియా కూడా ఆంధ్ర కేడర్‌కు మారారు. అలా 2020లో రాష్ట్రానికి వచ్చాక తొలుత విశాఖపట్నంలో పనిచేశారు. అనంతరం శ్రీశైలం కేంద్రంగా స్పెషల్ కలెక్టర్‌గా ఏడాదిన్నర, తదనంతరం 2022 ఏప్రిల్ నుంచి ఏడాదిపాటు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆతర్వాత దాదాపు ఏడాది కుటుంబపరమైన సెలవులో ఉన్నారు. ఈఏడాది జనవరి 29న శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులై ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్నారు. తొలుత కేంద్ర సర్వీసులలో పనిచేసిన సమయంలో విద్యాశాఖలో ఉన్న తమీమ్ అన్సారియా ఆ రంగానికి పెద్దపీట వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అలాగే సాధారణ ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యతలుగా చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం, మొత్తం యంత్రాంగం సహకారంతో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. సాధారణ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆమె చెప్పారు.

రమణీయం.. నృసింహుడి రథోత్సవం



పాతసింగరాయకొండలోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు.
- సింగరాయకొండ



రేషన్ షాపుల కోసం పోటీ

- జనసేన, బీజేపీ నేతల నుంచి కూడా ఒత్తిళ్లు
- ఈసారి పాత డీలర్లకే రేషన్ కేటాయించే అవకాశం

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 23 : జిల్లాలో రేషన్ షాపుల కోసం పోటీ పెరిగింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి భారీ విజయం సాధించడంతో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు అన్ని విషయాల్లో సముచితస్థానం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ ద్వితీయశ్రేణి నేతలతోపాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా తమ అనుచరులకు రేషన్ షాపులను ఇప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రేషన్‌షాపుల కోసం అధిక డిమాండ్ ఏర్పడటంతో ఇప్పటికిప్పుడు వాటిని కేటాయించే పరిస్థితి లేకుండాపోయింది. ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు పౌరసరఫరాల గిడ్డంగుల నుంచి నిత్యావసర సరుకులను సరఫరా ప్రారంభమైంది. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న డీలర్లకే ఈనెల సరుకుల పంపిణీ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్‌షాపులు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల వారీగా షాపులు కేటాయించాలంటే స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు రావాల్సి ఉంది. పరిస్థితులకు అనుగుణంగా ఈ రేషన్ షాపులను కేటాయించాలి. ఇంకోవైపు ఎన్‌డీఏ కూటమిలో జనసేన, బీజేపీ కూడా ఉండటంతో వారితో కూడా నియోజకవర్గాల వారీగా చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీంతో రేషన్ షాపుల కేటాయింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న డీలర్లకే నిత్యావసర వస్తువులను కేటాయింపు చేయనున్నట్లు తెలిసింది.

స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ


సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 23 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యతన ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో కనిగిరి, చీరాల, దర్శి, ఎర్రగొండపాలెం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎం.ఎం.కొండయ్య, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆయా సంఘాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. ముందుగా 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధి శాఖ, 1,7 స్థాయీ సంఘాలైన పనులు, ఆర్థిక విషయాలపై సమీక్షించారు. అనంతరం 3,4 స్థాయీ సంఘాలు వ్యవసాయం, విద్య, వైద్యంపై, 5,6 స్థాయీ సంఘాలైన స్త్రీ,శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం మొదలైన శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి సి.హనుమంతరావు, మారెడ్డి అరుణ, చుండి సుజ్ఞానమ్మ పాల్గొన్నారు.

దర్శికి మహర్దశ..

జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి రూ.18.51 కోట్లు

- నిధులు విడుదల చేస్తూ రవాణా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి తొలిసంతకం
- నెరవేరనున్న దర్శి ప్రాంత ప్రజల కల


పునాదుల్లో నిలిచిపోయిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం

దర్శి, జూన్ 23 : దర్శి ప్రాంత ప్రజల కలలు నెరవేరుతున్నాయి. టీడీపీ అధికారంలోకి రాగానే హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణానికి రూ.18.51 కోట్లు నిధులు విడుదల చేసింది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టాక నిధులు విడుదల చేస్తూ తొలిసంతకం చేశారు. అనంతరం ఆయన సీఎం చంద్రబాబుకు ఈ విషయాన్ని వివరించారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా దీనిపై నిర్లక్ష్య వైఖరి అవలంబించింది. టీడీపీ హయాంలో ఆరంభించారనే అక్కసుతోనే వైసీపీ పాలకులు చాలారోజులు పట్టించుకోలేదు. మధ్యలో కొంతమేర కదలిక వచ్చినప్పటికీ పనులు ప్రారంభించిన పాపానపోలేదు. స్థానిక వైసీపీ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లను బెదిరించటంతో వారు చేతులెత్తేశారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పాతటెండర్లు రద్దు చేసి పలుసార్లు రీటెండర్లు పిలిచింది. వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలనను గుర్తించిన కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఒక్కరు కూడా టెండరు కోట్ చేయలేదు. ఇక డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం అటకెక్కినట్లేనని ప్రజలు ఆశలు వదులుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ప్రజలు ఊహించిన విధంగానే దర్శి నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యత కల్గిన జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రానికి నిధులు విడుదల చేసింది. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, టీడీపీ కూటమి తరఫున పోటీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రైవింగ్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అందులోభాగంగా సీఎం చంద్రబాబు చొరవతో నిధులు వెంటనే విడుదలయ్యాయి.

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణానికి నిధులు విడుదల చేయటం పట్ల టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు సీఎం చంద్రబాబుకు, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీని ద్వారా కూటమి ప్రభుత్వం చేతల సర్కారు అని రుజువైందన్నారు. దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని విధాల సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తారని వారు స్పష్టం చేశారు.

దివ్యగుణాలను జాగ్రతం చేసేదే వ్రతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలునగరం, జూన్ 23: సత్యనారాయణ వ్రతం ఆచరించటం ద్వారా నరుని నుంచి నారాయణునిగా, నారి నుంచి శ్రీలక్ష్మిగా మనలోని దివ్యగుణాలను జాగ్రుతం చేసుకోవటమేనని బెంగళూరుకు చెందిన రాజయోగి బీకే మంజునాథ్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరం సంతపేటలోని కృష్ణప్రియ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ సంబంధిత కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో టి.మునికృష్ణయ్య, హరిప్రియ, బీకే.మాధవి, బీకే.రేవతి, రామలక్ష్మి, బచ్చల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీహర్షిణి విజయభేరి



ఒంగోలు(విద్య), జూన్ 23: డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు. బీకాం విభాగంలో కలువ శైలజ 622, పరుచూరి భార్గవిప్రియ 615, కంభంపాటి స్వాతి 613 మార్కులు సాధించి వరుసగా మొదటి మూడు స్థానాలలో నిలిచారు. బీసీఏ విభాగంలో చిట్టూరి రత్నమేఘన 842, రాయసం నిరుపమాసంజన 840, బత్తుల ఎస్తేరురాణి 827 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. బీఏ విభాగంలో వీవీఎస్ సంతోష్ 574, మారం శిరీష 497, పి.వెంకటఅమృత 492 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలలో నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.అంజనేయులు, ఏవో శ్రీనివాసరావు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల చొరవ అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

ఒంగోలు(కల్చరల్), జూన్ 23: చీరాలలో ఒక యువతిపై జరిగిన అత్యాచారానికి సంబంధించి కేవలం 36 గంటలలోనే నిందితులను పట్టుకున్న పోలీసుల చొరవ అభినందనీయమని ఏపీ మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ విషయంలో స్పందించిన తీరు హర్షణీయమని, ఏ మహిళ కూడా అవమాన పడకూడదని ఆమె చెప్పిన మాటలను నిజం చేస్తూ తక్షణమే నిందితులను పట్టుకోవటం అందరూ అభినందించాలని చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత, పోలీసు అధికారులను అభినందిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సమితి ప్రధానకార్యదర్శి మేడికొండ శాంతకుమారి, కోశాధికారి బీరం అరుణ, కె.శాంతిలత, సీహెచ్.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన బాలసుబ్రహ్మణ్యం

మద్దిపాడు, జూన్ 23: గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆయన కోరారు. ఆదివారం మద్దిపాడులోని జనసేన పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 25మంది జనసేన కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో వీర మహిళ విభాగం అధ్యక్షురాలు కాకర్లపూడి హరిత, ఉపాధ్యక్షులు ఆరెం వెంకటేశ్వర్లు, ఏడుగండ్ల సత్యనారాయారణ, దండె రామారావు, పొన్నం అయ్యప్ప, నాయకులు పాల్గొన్నారు.

248 మందికి వైద్యసేవలు



చికిత్సలు అందిస్తున్న వైద్యసిబ్బంది

సంతనూతలపాడు, జూన్ 23: వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డాన్ టు డస్క్ ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో ఆదివారం ఒంగోలుకు చెందిన ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 248 మందికి వైద్యచికిత్సలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. వాసవిక్లబ్ ప్రతినిధి మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ వి.నాగేంద్రప్రసాదరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా ప్రతినిధి వి.ప్రసాదరావు, ఉపాస్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23 : నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రైల్వే అసిస్టెంట్ కో పైలెట్, ఆర్‌ఆర్‌బీ టెక్నీషియన్స్, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఒంగోలులోని లాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు డైరెక్టర్ పాలపర్తి విజయ్‌భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ, యువతీ, యువకులు తమ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 29వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 7207012758 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

చీమకుర్తి, జూన్23 : చీమకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1985-86వ బ్యాచ్ పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తొలుత బ్యాచ్ విద్యార్థులచే నిర్మించబడిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తదుపరి జరిగిన సభలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన తమ గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ సభ్యులు మారం వెంకారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, ముప్పూరి రంగారావు, శ్రీనివాసరావు, థామస్, రత్నం, సుబ్బమ్మ, కోటమ్మ, రాజ్యలక్ష్మి, హెప్సిబా, బాశం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం..!

వేడుకగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ● కల్యాణంలో పాల్గొన్న మంత్రి స్వామి ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

నమో నరసింహ.. నామస్మరణతో మారుమోగిన దక్షిణ సింహాచలం



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి స్వామి



స్వామివార్ల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సింగరాయకొండ, జూన్ 23 : పాతసింగరాయకొండ శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయం నమో నరసింహ నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున స్వామి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి, ఉభయ దేవేరులు, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయ విగ్రహాలను పూలతో అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజా క్రతువు నిర్వహించారు. తదనంతరం కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించారు. స్వామి తలంబ్రాలు భక్తులకు పంపిణీచేసి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీకృష్ణ యాదవ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదానం చేశారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. తొలుత ఆలయఅధికారులు ఎదురేగి మేళతాళాలతో ఆయనకు స్వాగతం పలికారు. మంత్రి స్వామి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

వేడుకగా రథోత్సవం

వరాహ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం మోతకాపులు స్వామిని గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, వెంకటనరసింహాచార్యులు, యాజ్ఞికం సుదర్శనాచార్యులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



రథంపై విహరిస్తున్న శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి

బాలినేని అక్రమాలపై విచారణ చేయాలి

● జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ఒంగోలు(కల్చరల్), జూన్ 23: గత ఐదు సంవత్సరాలలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని రంగాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలినేని అనుచరులు భూకబ్జాలు చేస్తూ దొంగ రిజిస్ట్రేషన్లతో నగరంలో అనేక భూములు ఆక్రమించారని ఆరోపించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి బంధువు నిర్మిస్తున్న విల్లాల లెవలింగ్ కోసం అక్రమంగా కోట్లాది రూపాయల గ్రావెల్ తరలించటం, వాగుపోరంబోకును కలుపుకోవటంపై దర్యాప్తు జరపాలన్నారు. బాలినేని పేకాట, బెట్టింగ్ వంటి వ్యసనాలకు లోనై ఒంగోలు అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. 80శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వలేదని, నగరానికి దూరంగా 450 ఎకరాలు మార్కెట్ ధర కన్నా రెట్టింపు ధరతో కొనుగోలు చేశారని, అందులో రూ. 50 కోట్ల దోపిడీ జరిగిందని లక్ష్మణరెడ్డి చెప్పారు. సుపరిపాలన ఉపాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల సుబ్బారావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు మాట్లాడుతూ మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేయాలని, ఒంగోలు నగరంలో మాస్టర్ ప్లాన్‌ను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. రిటైర్డ్ పోలీసు అధికారి సుంకర సాయిబాబు మాట్లాడుతూ జిల్లాలో సైనిక్ స్కూలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ న్యాయవాది ఎన్.దేవకుమారి మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ నగర ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించటం లేదని, అధిక పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగితేనే ద్వారానే వలసలు ఆగుతాయని చెప్పారు. అయితే దీనిని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలి

జైశ్రీకృష్ణ బీసీ సమితి నాయకురాలు పద్మశ్రీసంతోష్‌యాదవ్



పద్మశ్రీసంతోష్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని జైశ్రీకృష్ణ బీసీ సమితి నాయకురాలు పద్మశ్రీసంతోష్‌యాదవ్ పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బీసీ విద్యార్థులకు ప్రోత్సాహక, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగింది. 2024 పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీసంతోష్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో చదువుకుని మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకోసం జైశ్రీకృష్ణ బీసీ సమితి అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ సాధించిన విద్యార్థులను ఇదే విధంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ.రమణకుమార్, అడకా స్వాములు, డాక్టర్ కాకు శ్రీకాంత్ యాదవ్, రవికిరణ్ పిచ్చయ్య పేగడ శ్రీనివాసకృష్ణ, రంజిత్ కుమార్, గురు ప్రసాద్, బంకా చిరంజీవి పలువురు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి విజయంతో శ్రేణుల పూజలు



27వ డివిజన్‌లోని వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న శ్రేణులు



మైలవరంలో టెంకాయలు కొడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23: ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా నగరంలోని 27వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామచర్ల ఆధ్వర్యంలో ఒంగోలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి పప్పు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు తూము సుబ్బారావు, కోటపాటి కాశీరావు, వాకాటి వెంకటేష్, గండికోట శివ, అజయ్, కొల్లిపల్లి హనీష్, కరముల్లా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో..

చీమకుర్తి : ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించి అధికారంలోకి రావటంతో ఆదివారం మండల పరిధిలోని మైలవరంలో టీడీపీ నాయకులు మొక్కులను తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్ కుమార్ గెలుపుసాధించినందున పోలేరమ్మతల్లి ఆలయంలో తెలుగుమహిళలు పొంగళ్లు చెల్లించారు. నాయకులు కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గొట్టిపాటి రామారావు, వేల్పుల శ్రీనివాసరావు, ఒరిగంటి ఫణికుమార్, బెల్లం కోటేశ్వరరావు, తిరుపతయ్య, సుబ్బారావు, కర్లపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా హాకీ జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

సంతనూతలపాడు, జూన్ 23: రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు మండలంలోని మైనంపాడు జడ్పీహైస్కూల్లో ఆదివారం ఉదయం జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పి.రవి, మాధవరావులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యాకమిటీచైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టీడీపీ హయాంలోనే మహిళలకు రక్షణ

● తెలుగు మహిళలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 23: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మహిళలకు రక్షణ లభిస్తుందని తెలుగు మహిళలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈపురుపాలెంలో ఓ మహిళలపై అత్యాచారం జరగ్గా, బాధితురాలికి అండగా ఉండేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత నేరుగా సంఘటన జరిగిన ఊరికి వెళ్లారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళగా, స్పందించిన సీఎం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు. అంతేగాకుండా 36 గంటల్లోనే నిందులను అదుపులోకి తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారని తెలిపారు. సమావేశంలో రావుల పద్మజ, నిడమనూరు పావని, బీరం అరుణరెడ్డి, పసుపులేటి సునీత, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అహరోన్‌రావుకు ఘన నివాళి

ఒంగోలు(విద్య), జూన్ 23: ఒంగోలు ఉపవిద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేసి శనివారం మరణించిన జి.అహరోన్‌రావుకు విద్యాశాఖ అధికారులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం అశ్రునయనాల మధ్య ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. ఒంగోలు మండల విద్యాధికారి టి.కిషోర్‌బాబు, ఏపీటీఎఫ్ నాయకులు విజయరావు, జి.శ్రీనివాసులు, వీరరాఘవులు, ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకట్రావు, జీఎస్.సాయి, ఎ.అమ్మయ్య, వీవీ.సుబ్బారావు, ఒంగోలు మండల ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు.

సమాజ సేవలో 'లయన్స్' ముందంజ



అవార్డు అందజేస్తున్న న్యామతుల్లాబాష

ఒంగోలు(కల్చరల్), జూన్ 23: సమాజ సేవలో లయన్స్ ఇంటర్నేషనల్ ఎప్పుడూ ముందుంటుందని సంస్థ రీజనల్ చైర్మన్ డాక్టర్ షేక్ న్యామతుల్లాబాష పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని బ్రిలియంట్ టెక్నాలజీస్‌లో జరిగిన రీజనల్ కాన్ఫరెన్స్‌లో బెస్ట్ జోన్ చైర్మన్, బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్సును ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరతమ భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు లయన్స్ సభ్యులు అందిస్తున్న సేవలు నూతన సభ్యులకు స్ఫూర్తిదాయకమన్నారు. రీజన్ పరిధిలోని జోన్1 చైర్మన్ సీహెచ్.శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ఎస్.అనుదీప్, ఎం.రామాంజనేయులు ఇతర క్లబ్ కార్యవర్గం చేసిన విశిష్ట సేవలకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్ బాబు, శిద్దా సూర్యప్రకాష్, నామినేని మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో ఘనంగా స్నాతకోత్సవం



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న అతిథులు

ఒంగోలు(విద్య), జూన్ 23: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. నాలుగు సంవత్సరాల విద్యను పూర్తిచేసి ఇంజనీరింగ్ వృత్తిలో అడుగు పెడుతున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాను ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్ చైర్మన్ ఎన్.గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుకు 'విద్యాప్రవేశం'

ఒంగోలు(విద్య), జూన్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు విద్యాప్రవేశం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీని అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు విడుదల చేశారు. విద్యాప్రవేశంలో భాగంగా ఈ నెల 24 నుంచి నాలుగు వారాల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులను నూరుశాతం పాఠశాలల్లో నమోదు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. కార్యక్రమం విజయవంతానికి విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, జూన్ 23: బ్యూటీపార్లర్ కోర్సులో మహిళలకు ఈ నెల 25వ తేదీ నుంచి ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణకాలంలో ఉచిత వసతితోపాటు భోజన సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం 9492583484 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మద్దిపాడు, జూన్ 23: వెంకటరాజుపాలెం జాతీయరహరి పక్కన గల రెనాల్ట్ షోరూం సమీపంలోని వెంచర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. నాలుగు రోజుల కిందట మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి ట్రాన్స్‌జెండర్ అయి ఉండచ్చని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దిపాడు, జూన్ 23: మద్దిపాడులో ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం ఆదివారం కమనీయంగా జరిగింది. శ్రీనివాసులరవికుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిపాటి వెంకట రమణ దీక్షితులు, తెనాలికి చెందిన దివి అంజనీకుమార్, మురుకుంట్ల సుబ్రహ్మణ్యశర్మ, గోపయ్య పంతులు, మారుతీలు శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. గంగినేని సురేంద్రబాబు, దివ్య దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం చౌదరి సంఘం ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ డోలు విద్వాంసుల కచేరి అలరించింది. ఈ సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణ జరిగింది.

మండూక్య ఉపనిషద్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 23: ప్రముఖ రచయిత, విశ్రాంత బీఎస్ఎన్ఎల్ అధికారి వారణాసి ప్రసాదరావు రచించిన మండూక్య ఉపనిషద్ పుస్తకావిష్కరణ ఆదివారం ఒంగోలులోని లాయర్‌పేటలో జరిగింది. విశ్రాంత ప్రధాన అధ్యాపకులు పింగళి పాండురంగారావు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అద్భుతమైన గ్రంథాన్ని రచించటానికి రచనా శక్తి, విషయస్ఫూర్తి ఎంతో ఉండాలన్నారు. మరొక అతిథి జీవీ.మురళీకృష్ణ మాట్లాడుతూ రచయిత ఇంతకుముందు రచించిన మనీషా పంచకం ఉపనిషత్తులు అనే గ్రంథం ఎంతో అద్భుతంగా ఉందని అదేవిధంగా ప్రస్తుత గ్రంథం సైతం విజ్ఞానదాయకంగా ఉందన్నారు. రచయిత ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉపనిషత్‌ల గురించి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

మద్దిపాడు, జూన్ 23: నందిపాడు గ్రామంలోని గంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజు పంతులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన కళ్యాణంలో ఉభయదారులుగా వంకాయలపాటి వీరన్న కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యానగర్‌గా ఆలకూరపాడు రోడ్డులోని లేఅవుట్


మాట్లాడుతున్న మొగల్‌కాలీషాబేగ్

టంగుటూరు, జూన్ 23 : టంగుటూరు పేద లు లబ్ధిదారులుగా ఉన్న ఆలకూరపాడులోని ఇళ్ల స్థలాల లేఅవుట్‌కు విద్యానగర్‌గా నామకరణం చేశారు. ఆదివారం ఆ లేఅవుట్‌లోనే ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల ఆధ్వర్యంలో లబ్ధిదారుల సమావేశం జరిగింది. ఈ మేరకు విద్యానగర్ అని నామకరణం చేస్తున్నట్లు తీర్మానించారు. అనంతరం విద్యానగర్ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశా రు. అనగొంది కోట్లింగం అధ్యక్షుడిగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ గుర్రం సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొడ్డు సతీష్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మొగల్‌కాలేషాబేగ్, సీపీఎం మండల కార్యదర్శి మోజెస్, సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్, జనసేన ప్రతినిధి కృష్ణ, ఎస్ పేరయ్య, బైసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఉపాధి హామీ పనులు

● పూటగడవక తిప్పలు పడుతున్న కూలీలు

టంగుటూరు, జూన్ 23 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు ముందు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేశారు. ఫలితాల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మండలంలో ఉపాధి పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలలో అత్యధికులు నిరుపేదలే. వీరిలో రెక్కాడితే కాని డొక్కాడని వారే. ప్రస్తుతం వ్యవసాయ పనులన్నీ ముగిసిపోయాయి. పనులు లేక కూలీలు తీవ్ర కష్టాలు పడుతున్నారు. వ్యవసాయ పనులు లేని రోజుల్లో రైతులు కూడా ఉపాధి పనులను ఆశ్రయిస్తుంటారు. వెంటనే అధికారులు ఉపాధి పనులను ప్రారంభించాలని కూలీలు కోరుతున్నారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి, జూన్23 : నూతన విద్యుత్‌లైన్ పనులు జరుగుతున్నందున సోమవారం చీమకుర్తి మండలపరిధిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీపాలెం, ఏలూరివారిపాలెం, గోనుగుంట, రామచంద్రాపురం, పిడతలపూడి, మర్రిపాలెం, జీఎల్ పురం, బండ్లమూడి, నాయుడుపాలెం, పాటిమీదపాలెం, మంచికలపాడు, ఎర్రగుడిపాడు, తొర్రగుడిపాడు గ్రామాల్లో, అలాగే నార్త్‌సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీయల్‌కు అనగా చీమకుర్తి ఆర్‌ఎల్ పు రం గ్రానైట్ పరిశ్రమకు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ స రఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల బిల్లుల కోసం ప్రదక్షిణలు

నిధుల విడుదలలో అధికారుల జాప్యం

ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు

దర్శి జూన్ 23: దర్శి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో వివిధ పనులు చేపట్టిన నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. నిధులు విడుదల అయినప్పటికీ అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. దర్శి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ, కౌంటింగ్ జూన్ 4వ తేది నాటితో ముగిసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా భోజనాలు, ఫ్లెక్సీలు, పర్నిచర్ తదితర పలురకాల పనులను వ్యాపారులు సొంత నిధులతో సమకూర్చారు. నిధులు విడుదలయిన త ర్వాత బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు ఇచ్చిన హామీ మేరకు వారు పనులు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి 20 రోజులు గడుస్తు న్నప్పటికీ అనేక మందికి ఇంకా బిల్లులు ఇవ్వలేదు. నిర్వాహకులు తహసీ ల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్కడ అధికారులు అందుబాటులో లేక ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసినట్లు సమాచారం. గతంలో ఎన్నడూలేని విధంగా రూ.1.5 కోట్ల నిధులు విడుదల అయినట్లు తెలిసింది. అయి నప్పటికీ స్థానిక అధికారులు సక్రమంగా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండటంతో నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా నిధులు డిప్యూటీ తహసీల్దార్ అకౌంట్‌కు జమ అయ్యాయని తెలిపారు. తహసీల్దార్ పర్యవేక్షణలో బిల్లులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కొంతమందికి ఇంకా బిల్లులు అందలేదనే విషయం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


ర్యాలీలో పాల్గొన్న భక్తులు

కనిగిరి, జూన్ 23: కనిగిరిలో ఆదివారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర సంబరాలు అంబరాన్ని తాకాయి. పెద్దఎత్తున భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. పట్టణంలోని వెంకటేశ్వ రస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణంలోని పురవీధుల్లో వైభ వంగా సాగింది. వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున భజనలు చేసుకుంటూ నగరంలో ఊరేగింపు నిర్వహించారు. నగరంలో ఊరేగింపు జరుగుతున్న ప్రదేశాల్లో ఆధ్యాత్మిక భావంతో అన్నివర్గాల ప్రజలు ఆంజనేయస్వామి, శివాజి విగ్రహాలను తిలకించి పూజలు చేశారు. పారు వేట పోసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నా,పెద్ద కాషాయ వస్త్రాలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్లను వికేంద్రీకరించాలి

● మంత్రిని కలిసి కోరిన ఎమ్మెల్యే ఏలూరి


మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, జూన్ 23: రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, పశుసంవర్ధక డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం మర్యాదపూర్వకంగా విజయవాడ మంత్రి స్వగృహంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ అభివృద్ధికి విశేష కృషిచేయాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌లను వికేంద్రీకరించాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ ఉందని , నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం అని అన్నారు. ఉన్న ఆరు మండలాలు సుదూరప్రాంతాలుగా విస్తరించి ఉన్నా యన్నారు. మార్టూరు, యద్దనపూడి మండలాలకు మార్టూరు మార్కెటింగ్ యార్డు, పర్చూరు, కారంచేడు మండలాలకు పర్చూరు మార్కెటింగ్ యార్డు, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలకు చిన్నగంజాం మార్కెట్ యార్డులుగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రైతాంగానికి అండగా నిలవాలని, అన్నదాతల అభ్యున్నతికి కృషిచేయాలని ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, టీడీపీ నాయకులు కోడెల శివరాం తదితరులు ఉన్నారు.

చక్రాయపాలెంలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత



అద్దంకి, జూన్23: చక్రాయపాలెంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వైసీపీకి చెందిన యువకుడు చించి వేసినట్లు టీడీపీ శ్రేణులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన వైసీపీ యువకుడు టీడీపీ ఫ్లెక్సీ చించి వేసి వెళ్తుండగా టీడీపీ శ్రేణులు చూసి కేకలు వేశారు. అయితే అప్పటికే ఆ యువకుడు జారుకున్నాడు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో పాటు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేశారు.

పాఠశాలల విలీనం-కళా విహీనం !

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ● సరస్వతీ నిలయాలకు శాపం ● రూ.40లక్షలకుపైగా ప్రజాధనం దుర్వినియోగం


కెల్లంపల్లి ఎస్సీకాలనీలో నిరుపయోగంగా మారిన పాఠశాల భవనాలు

మర్రిపూడి, జూన్ 23 : గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దగ్గరదగ్గర పాఠశాలలను విలీనం చేయాలనే నిర్ణయం సరస్వతీ నిలయాలకు శాపంగా మారింది. ఆ మేరకు కిలోమీటరు దూరంలో ఉన్న వాటిని సమీప పాఠశాలల్లో విలీనం చేస్తూ జీవో.117ను విడుదల చేసింది. అంతేకాకుండా నాడు-నేడు పేరుతో విలీనానికి ముందే ఆయా పాఠశాలలను ఆధునీకకరించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన ప్రజాధనమూ నిరుపయోగమైంది. మండలంలో పలు పాఠశాలలకు రూ.40 లక్షలకుపైగా వెచ్చించిన నిర్మించిన భవనాల పనులు అర్థంతరంగా ఆగిపోయాయి.

నిధులు వృథా ఇలా...

● మండలంలోని చిలంకూరు ఏయే పాఠశాలను సమీప ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఆ పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులు 40 మందికి పైగా ప్రాథమికోన్నత పాఠశాలకు విలీనం అయ్యారు. దీంతో ఆ పాఠశాలలో ఒక ఉపాధ్యాయ పోస్టు రద్దయింది. విలీనం కాకముందు నాడు-నేడు పథకం కింద ఆ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 36 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.14 లక్షలకు పైగా ఖర్చు పెట్టారు.

● కెల్లంపల్లి ఎస్సీ పాఠశాలను సమీప ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయడంతో ఆ పాఠశాలలో రెండు ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయి. 60 మంది విద్యార్థులు వెళ్లిపోవడంతో ఆ పాఠశాల ప్రాంగణం కళావిహీనంగా మారింది. ఈ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.57 లక్షలు నిధులు మంజూరు చేయగా ఇప్పటి వరకు రూ.23 లక్షల నిధులతో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి.

● గార్లపేట జనరల్ పాఠశాలను సమీప జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విలీనం చేయడంతో అక్కడి తరగతి గదులు నిరుపయోగంగా మారాయి. ఈ పాఠశాలలో రెండు ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయి.

● తంగెళ్ల జనరల్ పాఠశాల, రాజుపాలెం ఎస్సీ పాఠశాలను సమీప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు.

● మర్రిపూడి జనరల్ పాఠశాలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలుత విలీనం చేశారు. అయితే గ్రామస్తులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విలీన ఉత్తర్వులను రద్దు చేయించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వలన రెండు ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయి.

దీంతో మండలంలో 3, 4, 5 తరగతులు చదివే 150 మందికి పైగా చిన్నారులు విలీన పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విలీనమైన పాఠశాలలు ప్రధాన రహదారుల పక్కనే ఉండటం వలన ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ఎన్నికల ప్రచారం సందర్భంగా యువనేత నారా లోకేష్ జీవో 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు గుర్తు చేస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి కూడా కృషి చేయాలని కోరుతున్నారు.

పలు దేవస్థానాల్లో మంత్రి స్వామి పూజలు


దావగూడూరులో పూర్ణకుంభంతో మంత్రి స్వామి, సత్యలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు


కొణిజేడులో ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి స్వామి

● పూర్ణకుంభంతో అర్చకుల స్వాగతం

జరుగుమల్లి(కొండపి), జూన్ 23 : మండలంలోని దావగూడూరు గ్రామంలోని ప్రసన్నచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికల్యాణాన్ని భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చదలవాడ బ్రహ్మేంద్రం, బత్తిన బ్రహ్మయ్య, నరసింహారావు, కంచర్ల రామకృష్ణ, వెంకటస్వామి, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కామేపల్లి పోలేరమ్మ దేవస్థాన వార్షికోత్సవం సందర్భంగా మంత్రి స్వామి, టీడీపీ నేత సత్యలు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు పాల్గొన్నారు. వెన్నూరు అంకమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా స్వామి, సత్యలు పూజలు చేశారు.

కొణిజేడులో..

టంగుటూరు: మండలంలోని కొణిజేడులో జరుగుతున్న చక్రధర జనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. తొలుత మంత్రిని గుర్రాల రథంపై టీడీపీ సీనియర్ నాయకుడు రామా కామయ్యతో కలసి గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం చక్రధర జనార్దనస్వామి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేత రామా గోపి, ఈదర ప్రభాకర్, హరిబాబు, ఎంపీటీసీ వేణు పాల్గొన్నారు.

చీరాలలో అసాంఘిక శక్తులను ఏరేస్తాం !

అధికారులూ సక్రమంగా పనిచేయండి..లేకుంటే వెళ్లిపోండి ● ఎమ్మెల్యే కొండయ్య హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 23 : 'నియోజవకర్గంలో అసాంఘిక శక్తులను ఏరిపారేస్తాం. జరిగిన, జరుగుతున్న సంఘటనలపై ఉక్కుపాదం మోపుతాం. ఎవరిని ఉపేక్షించేది లేదు. తీరప్రాంతంలో రిసార్ట్ నిర్వహకులు పర్యాటకుల భద్రత బాధ్యతను తీసుకోవాలి. అలా కాదనే రిసార్ట్‌లకు తాళాలు వేయిస్తాను. రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు చెక్ చెప్తాం. అందుకు డిపార్ట్‌మెంట్‌పరంగా కఠినంగా వ్యవహరిస్తామని' ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య హెచ్చరించారు. అధికారులు సక్రమంగా పనిచేయండి. లేదా వెళ్లిపోండి. మీ అంతట మీరు వెళితే సంతోషం. నేను పంపిస్తే వీఆర్(వేకెన్సీ రిజర్వ్‌డ్)నని కొండయ్య స్పష్టం చేశారు. ఆదివారం వేటపాలెం మండలం రామాపురం తీరంలో మంగళగిరికి చెందిన 12 మంది బంగారు పనివారు ఆటవిడుపుగా వేటపాలెం మండలం రామాపురం వచ్చారు. సముద్రంలో దిగిన నేపథ్యంలో ఇరువురు ప్రమాదకరస్థితికి చేరారు. వారు మృతి చెందారు. ఇదిలా ఉంటే చీరాల సంగం థియేటర్ సమీపంలో సంతోష్ అనే క్రరీస్ పాయింట్ వ్యాపారి, పండ్ల వ్యాపారి మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో పండ్ల వ్యాపారి సంతోష్‌ను కత్తితో పొడవటంతో మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై ఎమ్మెల్యే కొండయ్య ఘాటుగా స్పందించారు. ఏరియా వైద్యశాలలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. ఆ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఈపురుపాలెంలో యువతి రేప్, హత్యకు సంబంధించి గంటల వ్యవధిలో హోం మినిస్టర్, ఎమ్మెల్యేగా తాను సీఎం చంద్రబాబు ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టడంతో పాటు, నిందితులను పట్టుకోవటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చీరాల నియోజకవర్గంలో ఏం జరిగిందనేది తనకు అనవసరమని, ఇకపై అసాంఘీక శక్తులు ఎక్కడ అలజడి సృష్టించాలని ప్రయత్నించినా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గంజాయి బ్యాచ్‌లకు వెన్నులో వణుకు పుట్టిస్తామన్నారు. అందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు అప్రమత్తం కావాలన్నారు. ఎన్నికల వేళ కొందరు తన పైనే దాడి చేయటానికి ప్రయత్నించారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనే కోణంలో పరిశీలించి కఠినతరంగా వ్యవహరిస్తామని ఘాటుగా చెప్పారు. మంగళగిరి అంటే మంత్రి లోకేష్ నియోజకవర్గం నుంచి వచ్చిన వారికి ఇలా జరగటం కలిచివేచిందన్నారు. జరిగిన నష్టం పూడ్చలేనిది. అయితే ఇవే ఆఖరి ఘటనలు కావాలని చెప్పారు. రిసార్ట్ నిర్వాహకులు, అధికారులతో సమీక్ష జరిపి తగిన చర్యలు చేపడతాం. వారు సక్రమంగా స్పందిస్తే సరేసరి. సాకులు చెప్పి తప్పించుకోవాలని చూస్తే వాటికి తాళాలు వేయిస్తామని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు

గుర్తించిన ప్లీచ్ ఇండియా సీఈవో శివనాగిరెడ్డి


శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరాలయంలో క్రీ.శ. మూడో శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్లను ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఈ జిల్లాలో వారసత్వ సంపదను పరిరక్షించి భావి తరాలకు అందించాలన్న అవగాహన కార్యక్రమంలో ఆదివారం ఆయన రామతీర్థంలో పర్యటించారు. ఆలయం వెనుక వైపున ఉన్న శివలింగాల మధ్య పల్నాటి సున్నపు రాతి బౌద్ధ స్తంభాన్ని, దానిపై అర్ధచంద్రకార పద్మాన్ని కనుగొన్నారు. ఈ శిల్పం ఇక్ష్వాకుల కాలం నాటిదని గుర్తించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ, వేంగ చాళుక్యుల కాలంలో ఈ స్తంభాన్ని బ్రహ్మసూత్రాలు చెక్కి, శివలింగంగా మార్చి బిగించారని పేర్కొన్నారు. మరో రెండు శివలింగాలు, క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన వీరభద్ర విగ్రహం నిరాదరణకు గురయ్యాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యకు మంత్రి లోకేష్ ఫోన్

● ఇద్దరు మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి

చీరాల, జూన్ 23 : వేటపాలెం మండలం రామాపురంకు ఆదివారం మంగళగిరి నుంచి వచ్చిన యువకుల బృందంలో ఇరువురు సముద్రంలో గల్లంతై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. వివరాలు తెలుసుకుని లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే వారికి ఎలాంటి సహాయం అవసరమైనా చేయాలని కొండయ్యకు సూచించారు. వెంటనే కొండయ్య వేటపాలెంలోని రామాపురం తీరంలో సంఘటన జరిగిన ప్రదేశాన్ని డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌తో కలసి పరిశీలించారు. డిపార్ట్‌మెంట్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కొంత స్పష్టత ఇచ్చారు. అంతకు ముందు సంతోష్ అనే యువకుడి హత్యకు సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకున్నారు. రౌడీలు, అల్లరిమూకలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపి, ఎక్కడికక్కడ ఏరివేయాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు.

ఇంకొల్లు సమస్యలపై ప్రధానికి ఈ-మెయిల్

ఇంకొల్లు,జూన్ 23: ఇంకొల్లు ప్రాంతంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని ఆత్మ నిర్భర్‌భారత్‌లోకి చేర్చాలని, టోల్‌ట్యాక్సులు,డీజిల్ ధరలు తగ్గించాలని విన్నవిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి ఈ-మెయిల్ ద్వారా ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంబొట్ల మోహనకృష్ణ ఆదివారం విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో సమస్యలు పరిష్కరించాలని అందులో కోరినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పీసీపల్లి, జూన్ 23: పశుగ్రాసానికి వెళ్లిన రెండు గేదెలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన మండలంలోని విఠలాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మడతల మద్దిరెడ్డి, శంకరమ్మ దంపతులు గేదెలు మేపుకుని పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. శంకరమ్మ ఎప్పటిలాగే ఆదివారం ఉదయం తన గేదెలను పశుగ్రాసం కోసం పొలం తోలుకెళ్లింది. గ్రామ సమీపంలో ఉన్న పొలంలో పైన హైటెన్షన్ విద్యుత్ లైన్, కింద ఎల్‌టీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఎల్‌టీ లైనుకు విద్యుత్ సరఫరాను ఇదివరకే నిలిపివేసి ఉన్నారు. పశుగ్రాసానికి వెళ్లిన గేదెలలోని ఒక గేదె గ్రాసం మేస్తూ అక్కడ ఉన్న కట్ట ఎక్కింది. కట్ట దిగుతున్న సమయంలో గేదె కొమ్ము ఎల్‌టీ లైనుకు తగలడంతో గేదె కట్టమీద నుంచి కిందకు జారింది. ఈ క్రమంలో గేదె కొమ్ముకు తగులుకుని ఉన్న ఎల్‌టీ లైను వైరు దానిపైన ఉన్న హైటెన్షన్ లైను వైరుకు తగలడంతో గేదెకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది పక్కనే గ్రాసం మేస్తున్న మరో గేదె కూడా షాక్‌కు గురై మృతిచెందింది. కుటుంబపోషణకు జీవనాధారమైన రెండు గేదెలు మృతి చెందడంతో శంకరమ్మ బోరున విలపించింది. మృతిచెందిన గేదెల విలువ 1.5 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఘటనాస్థలాన్ని విద్యుత్ ఏఈ ల క్ష్మీరాజేష్ సందర్శించి బాధిత పాడిరైతును అడిగి వివరాలను నమోదు చేసు కున్నారు. విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

జాతీయస్థాయి పోటీలకు బొద్దికూరపాడు విద్యార్థి


శివరామకృష్ణతో పీడీ రవిప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు, జూన్ 23: రాష్ట్రస్థాయి జూనియర్ రగ్బీ టోర్నమెంట్‌లో మండలంలోని బొద్దికూరపాడు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థి గంజ శివరామకృష్ణకుమార్ ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 18 ఏళ్ల లోపు జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో భీమునిపట్నంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఈనెల 25, 26, 27 తేదీలో పూణెలో జరగనున్న జాతీయ రగ్బీ టోర్నమెంట్‌లో శివరామకృష్ణ పాల్గొననున్నట్లు పీడీ రవిప్రసాద్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రగ్బీ క్రీడాకారుడు శివరామకృష్ణను హైస్కూల్ హెచ్‌ఎం పి.సుబ్బారావు, విద్యాకమిటీ చైర్మన్ వై.కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్యాంసన్, వైస్ సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, రిటైర్ట్ టీచర్ ఎస్.అంజిరెడ్డి, సంగన యోగిరెడ్డి తదితరులు అభినందించారు.

పద్యం పుట్టిన నేలపై పురస్కారం ఓ భాగ్యం


మాట్లాడుతున్న ప్రవచనకర్త వెంకటశివరామ ప్రసాదరావు

అద్దంకిటౌన్, జూన్ 23: పద్యం పుట్టిన గడ్డ, ఎర్రాప్రగడ నడయాడిన అద్దంకి నేలపైన పురస్కారం అందుకోవడం ఒక భాగ్యంగా భావిస్తున్నానని ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వైదిక వాఙ్మయ పరిశోధకులు, రచయిత పోలూరి వెంకటశివరామప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవాసదన్‌లో సాహితీ మిత్రమండలి అద్దంకి ఆధ్వర్యంలో ఆత్మీయ పురస్కార సభ లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా రామోజీరావుకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు శివరామ ప్రసాదరావు రచనలు, కథలు, గ్రంథాలను పరిచయం చేశారు. శివరామప్రసాదరావు ఆధ్యాత్మిక ప్రవచన కర్తఅని, బ్రహ్మ సూత్రాలు, వేదవాఙ్మయం, ఉపనిషత్తులు వంటి ఆధ్యాతిక గ్రంథాలను ఆంధ్రానువాదం చేయడంతో పాటు రసోచితమైన వ్యాఖ్యలతో, సరళవ్యవహారిక శైలిలో పాఠకలోకానికి అందిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. భారతీయత హైందవ సంప్రదాయక పరిమళమని, మన ఇతిహాసాలైన రామాయణ, భారతాలు మనిషిలోని సౌజన్యాన్ని, సౌశీల్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. అనంతరం శివరామ ప్రసాదరావు దంపతులను సత్కరించి ఆత్మీయపురస్కారాన్ని మిత్రమండలి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డీవీఎం సత్యనారాయణ, చప్పిడి వీరయ్య, మురళిసుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.


గండి పడిన పూసలపాడు చెరువు(ఫైల్)

చెరువులకు గండ్లు

● మరమ్మతులకు నోచుకోని దైన్యం ● ఆయకట్టుదారుల ఆందోళన ● పూసలపాడు చెరువు పరిస్థితి అధ్వానం

బేస్తవారపేట, జూన్ 23: బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏళ్లతరబడి ఈ చెరువుల గండ్లను పూడ్చలేదు. పంట కాలువలు, తూములు అధ్వానంగా ఉన్నాయి. గతంలో జరిగిన పనుల్లో నాణ్యత లోపించడంతోపాటు మంజూరైన నిధులను సక్రమంగా చెరువులకు ఉపయోగించకపోవడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని కొన్ని చెరువులకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బేస్తవారపేట మండలంలోని పూసలపాడు గ్రామంలోని చెరువులు రెండు దశాబ్ధల క్రితం నిర్మించారు. కోట్ల రూపాయాలు వెచ్చించారు. అయితే నేటికీ ఆ చెరువుల ఉపయోగంలోకి రాలేదు. చెరువుల కట్ట బలహీనంగా ఉండడంతో చెరువుకు నీరు వచ్చిన ప్రతి ఏటా చెరువుకు గండ్లు పడి ఒకరోజులోనే నీరు వాగుపాలైతుంది. దీంతో 800 ఎకరాల ఆయకట్టు నిరుపయోగంగా మారింది. అయితే ఈ చెరువుకు గతంలో రూ.2కోట్లు ప్రతిపాదనలు పంపారు. అలాగే కోనపల్లె చెరువు ఏర్పడినప్పటి నుండి చెరువులో చుక్కనీరు నిల్వలేదు. పలుమార్లు మరమ్మతులు చేశారు. కోట్లు రూపాయాలు ఖర్చు చేశారు. కాని ఫలితం కనిపించడంలేదు. చెరువులో భూగర్భంలో బుంగలు ఏర్పడి చెరువులోని నీరు పూర్తిగా బయటకు పోతుంది. పలువురు నిపుణులు పరిశీలించి అనేక రకాల పనులు ప్రయోగాత్మకంగా చేసిన ఆశించిన ఫలితం కనిపించడంలేదు. ఫలితంగా 500 ఎకరాల ఆయకట్టు నిరుపయోగంగా మారింది. శింగరపల్లె గ్రామానికి తూర్పువైపున నూతనంగా చెరువుల ఏర్పాటు చేస్తే వందల ఎకరాల్లో పంటలు సస్యశ్యామలంగా పండుతాయని దీంతో రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని అధికారులు సర్వేలకే పరిమితమయ్యారు. రూ.11 కోట్ల రూపాయాలతో ప్రతిపాదనలు పంపారు. కాని ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకోలేదు. నిధులు మంజూరుకాలేదు. ఫలితంగా వెయ్యి ఎకరాలకుపైగా భూములు బీడు భూములుగా ఉన్నాయి. అలాగే జేసీ అగ్రహారం చెరువుకు పూర్తి పూర్తి స్థాయిలో చెరువు కట్ట ఎత్తు పెంచాల్సి ఉండగా పెంచలేదు. చెరువులో చుక్కనీరులేదు. అలాగే దప్పిలివారి కుంటకు సప్లై ఛానల్ కత్వ నుండి నీరు వచ్చే కాలువను అభివృద్ధి చేస్తే చెరువు కింది ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు కోరుతున్నారు. మోక్షగుండం కొత్తచెరువు, ఖాజీపురం హోసూరమ్మ చెరువుల పంట కాలువకు మరమ్మతులు, తూములకు మరమ్మతులు చేయా ల్సి ఉంది. అలాగే జెన్నివారిపల్లె చెరువుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నోచుకోక రైతులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మల్లాపురం చెరువుకు మరమ్మతులు చేసిన చెరువులో నీరు లేక సూమారు 1500 ఎకరాలు సాగులోకి రాలేదు. జగ్గంబోట్ల కృష్ణాపురం ఉప్పువాగు నుండి ఆయకట్టు కాలువను పూర్తి స్థాయిలో


అడవిని తలపిస్తున్న పూసలపాడు చెరువు

మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. పిటికాయగుళ్ల చెరువుకు రూ.2కోట్లతో పనులు చేసిన ఫలితం సక్రమంగా లేదు. చెరువులో నేటికి చిల్లకంపతో నిండి ఉంది. చెరువుల ఆక్రమాణాల్లో ఉంది. చెరువులు మరమ్మతులకు నోచుకోక అలాగే ఉన్నాయి. ఈ ఏడాదైన ఈ చెరువులకు మరమ్మతులు నిర్వహించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

● పట్టించుకోని అధికారులు


కంభం రైల్వేస్టేషన్, అర్బన్ కాలనీకి వెళ్లే దారి

కంభం, జూన్ 23 : కంభం అర్బన్‌కాలనీ, రైల్వేస్టేషన్‌కు వెళ్లే కిలో మీటరుకు పైగా ఉన్న రహదారిలో భారీగా గోతులు పడ్డాయి. దీంతో రహదారి వెంబడి ప్రయాణించాలంటే కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారి మధ్యలోని గోతుల్లో నీరు నిలుస్తోంది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు జారికింద పడి గాయపడుతు న్నారు. కాలనీకి, రైల్వేస్టేషన్లకు వెళ్లాలంటే ప్రధాన రహదారి ఉన్నా, అది రెండు కిలోమీటర్ల పైగా దూరం ఉంది. కంభం, కందులాపురం పట్టణవాసులు ఎక్కువగా దగ్గరిదారైన ఈ రహదారి నుంచే వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే దారిలో వెనుకవైపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వారు ఈ వైపే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వాహన తాకిడి ఉన్న ఈ వైపు ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుంచేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం


నీళ్ల ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్

పొదిలి, జూన్ 23 : కుంచేపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు సర్పంచ్ వరికుంట్ల కాంతమ్మ, పేరం చినగోవిందా రెడ్డి, బాదం యోగి రెడ్డి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో పరిష్కరించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పలువురు వారి దృష్టికి తీసుకెళ్లగా సొంత నిధులతో ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలో నీటి సరఫరా చేశారు. ఏర్పాటు చేసిన ట్యాంకర్‌ను టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నీటిసమస్యను తీర్చేందుకు ముందుకొచ్చిన యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

గోవులకు గ్రాసంకోసం ఆర్థిక సాయం

పొదిలి, జూన్ 23 : గోవులకు ఆకలితీర్చేందుకు గ్రాసం కోసం కరిముల్లాబేగ్ ఆర్థిక సాయాన్ని గో సంరక్షణ సమితి సభ్యులకు అందజేశారు. ఆదివారం పొదిలి దర్శి రోడ్డులోని గోశాలలో జరిగిన మానవత స్వచ్ఛంద సంస్థ సమావేశంలో గోవులకు గ్రాసం కోసం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఆయనను గోశాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థినికి రక్షాఫౌండేషన్ అభినందన



విద్యార్థిని సన్మానిస్తున్న రక్షా సభ్యులు

కొమరోలు, జూన్ 23: ఏపీ ఎంసెట్, నీట్‌లో ప్రతిభ కనబ రించిన విద్యార్థిని స్థానిక రక్షా ఫౌండేషన్ సభ్యులు కొమరోలులో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రక్షాఫౌండేషన్ నిర్వాహకులు పోలెపల్లి జనార్దన్ మాట్లాడుతూ కొమరో లులో నివాసం ఉంటున్న డాక్టర్ దివాన్ బాషా, అమ్మాజిల చిన్న కుమారుడు షేక్ మహమ్మద్ జానీ ఏపీ ఎంసెట్‌లో 787 ర్యాంకు, ఆల్ ఇండియా నీట్ ఎంట్రెన్స్ పరిక్షలో 6434 ర్యాంకు సాధించి సత్తాచాటారు. వీరిని రక్షాసభ్యులు ప్రత్యేకంగా శాలువతో ఘనంగా సన్మానించారు. ఆలానే విద్యార్థు లు బాగా చదివి మన ప్రాంతం పేరును తీసుకురావాలన్నారు. కార్యాక్రమంలో నిర్వాహకులు జాలాది తారకరామలింగేశ్వరరావు, అబ్దుల్ రహీం, లక్ష్మిజర్షిత పాల్గొన్నారు.

'క్షీరక్రాంతి'కి ఆదరణ కరువు


మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం

బేస్తవారపేట, జూన్ 23: జిల్లాలో వెనుకబడిన ప్రాంతంలోని పశ్చిమ ప్రాంతంలో మహిళల జీవనోపాధిని పెంపొందించడానికి 2008లో అప్పటి ప్రభుత్వం జిల్లాలోనే ప్రథమంగా బేస్తవారపేట మండలంలో ముఖ్యమంత్రి క్షీర క్రాంతి పథకాన్ని ప్రారంభించింది. హైదరాబాబాదు ఎస్ఈఆర్‌ఐ సహకారంతో బల్క్‌మిల్క్ యూనిట్ సెంటర్‌ను అప్పటి ఆర్థికశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఐకేపీతో మండల మహిళ సమైఖ్య ఆధ్వర్యంలో ఈ పాల శీతలీకరణ కేంద్రం నడుస్తోంది. లక్షల రూపాయలు వెచ్చించి రూ.5వేల లీటర్ల పాలను చిల్లింగ్ చేసే యూనిట్, కంప్యూటర్, పాల క్యాన్లు తదితర సామగ్రిని అందజేశారు. దీంతో మండలంలోని మహిళ సమైఖ్య గ్రూపులు 20 యూనిట్లు వివిధ గ్రామాల్లో రైతుల నుంచి పాలు సేకరించి అప్పట్లో రోజుకు 3వేల లీటర్ల పాలను ఈ చిల్లింగ్ సెంటర్‌కు తరలించేవారు. దీంతో కంభం, పిటికాయగుళ్ల స్టేట్‌బ్యాంకుల నుండి పాల ఉత్పత్తిదారులకు రుణసదుపాయం, ప్రభుత్వం నుంచి పశువులకు ఉచితంగా దాన సరఫరా చేసేవారు. అయితే రానురాను మండలంలో మూడు ప్రయివేట్ పాల డెయిరీలు ఏర్పాటు చేశారు. ఇక వైసీపీ ప్రభుత్వంలో అధికారుల అదరణ కరువుకావడంతో ఈ కేంద్రం గురించి పట్టించుకున్నవారు కరువయ్యారు. దీంతో ప్రయివేట్ డైరీ నిర్వహకులు ధరలు పెంచి పాలసేకరణ చేస్తుండటంతో మహిళలు నడుపుతున్న ఈ డెయిరీ కాస్తా నాలుగేళ్ల నుంచి మూతపడింది. దీంతో డెయిరీలో పనిచేస్తున్న మేనేజర్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఎలక్ట్రిషియన్, వాచ్‌మేన్, స్వీపర్‌లు ఉపాధిని కోల్పోఆరు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఈ పాల కేంద్రాన్ని ప్రారంభించి సిబ్బందిని పాల ఉత్పత్తిదారులను, రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కంభం, జూన్ 23 : కంభంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6, 7 తరగతుల్లో 2024-25 విద్యాసంవత్సరానికి మిగులు సీట్లు భర్తీ చేయడానికి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.చాముండేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరే విద్యార్థులు ఆధార్, కులధృవీకరణ పత్రాలతో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కంభంలో సమర్పించాలని, దరఖాస్తు చేసుకున్న వారికి 27వ తేది ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు.

పాఠశాలల్లో చేర్పించాలి : ఎంపీడీవో


ప్రసంగిస్తున్న ఎంపీడీవో హేమలత

గిద్దలూరు, జూన్ 23 : బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో హేమలతదేవి అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో 'బడికి పోదాం' కార్యక్రమంలో భాగంగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఐసీడీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి బడిఈడు ఉన్న పిల్లలను గుర్తించి వారు బడికి వెళుతున్నారో, లేదో తెలుసుకొని పాఠశాలకు వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమినర్ శ్రీనివాసులు, ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరం

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య


పూలసుబ్బయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 23: రాష్ట్రంలో ఆర్థిక అవినీతి కన్నా రాజకీయ పార్టీల నాయకుల అవినీతి అత్యంత ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు పూలసుబ్బయ్య 37వ వర్ధంతి ఆదివారం స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో నిర్వహించారు. తొలుత పూలసుబ్బయ్య తాయమ్మ దంపతుల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఈశ్వరయ్య మాట్లాడుతూ.. దేశంలో అన్ని రంగాలలో అవినీతి విలయతాండవం చేస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో రాజకీయ పార్టీ లు ఎన్నికల నిబంధనలు విస్మరించి వేల కోట్ల రూపాయలు వ్యయం చేశాయ న్నారు. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయా లన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముంపు గ్రామ బాధితులకు నష్ట పరిహారం అందించకుండా, ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా జాతికి అంకితం చేయడం ఈ ప్రాంత ప్రజలను అవమానపర్చడమే అన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి పూలసుబ్బయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం, ఎస్టీయూ నాయ కులు ఎర్రయ్య, సీపీఎం నాయకులు బాలనాగయ్య, పూలసుబ్బయ్య కుమార్తెలు సుభాషిణి, సునందిని తదితరులు పాల్గొన్నారు.

పూలసుబ్బయ్యకు ఘన నివాళి

ఎర్రగొండపాలెం, జూన్ 23 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సీపీఐ నాయకులు దివంగత పూల సుబ్బయ్య 37 వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం ఎర్రగొండపాలెంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని పూలసుబ్బయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీనియర్ నాయకులు టిసి హెచ్ చెన్నయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశానికి సాగునీరు, తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు అవసరం అని గుర్తించి ఉద్యమం చేపట్టిన నాయకుడు పూల సుబ్బయ్య అన్ని అన్నారు. పేదల సమస్యల కోసం పశ్చిమ ప్రకాశంలో పోరాడిన మహానాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేవీ.కృష్ణగౌడ్, నక్కా తిరుమలయ్య, ఆవుల యోగయ్య, మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మార్కాపురం వన్‌టౌన్, జూన్ 23: స్థానిక శివాజీనగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం గోపూజ, విశ్వక్సేనా ఆరాధనా, పుణ్యాహకవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హాకీజట్టు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

సంతనూతలపాడు, జూన్ 23: రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు మండలంలోని మైనంపాడు జడ్పీహై స్కూ ల్లో ఆదివారం ఉదయం జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకు లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పి.రవి, మాధవరావులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యాకమిటీచైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, జూన్ 23 : డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ .నారాయణ మాట్లాడుతూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి, 370 అర్టికల్ రద్దు కోసం ముఖర్జీ ఉద్యమం చేయగా, అప్పటి ప్రభుత్వం జైలులో నిర్బంధించిందని, అనుమాన స్పద స్థితిలో ఆయన మృతిచెందాడన్నారు. ఆయన ఆశయాన్ని నేటి మోదీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసి అఖండ భారత్‌ను పునఃనిర్మించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాలలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, అసెంబ్లీ కో-కన్వీనర్ గుమ్మా రాముడు, బీజేపీ నాయకులు ఎం.పుల్లయ్య, రాచర్ల కాసులు, జయప్రసాద్, తిరుపాల్‌రెడ్డి, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ముఖర్జీకి ఘన నివాళి

పెద్ద దోర్నాల : స్థానిక శివసదన్‌లో జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు ఎస్ గండిపీరా రెడ్డి అధ్యక్షతన ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశింపీరా, అంబటి అల్లూరి రెడ్డి, వెన్నా లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు కొనసాగించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.కృష్ణారావు అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. దేశంలో ఇద్దరు ప్రధానులు రెండు జెండాలు ఉండకూడదని చివరి వరకు పోరాటం చేశారన్నారు. 1953లో ఆయన ఆత్మసమరణదినాన్ని బలిదాన్ దివాస్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతల కృష్ణ, బీజేపీ నాయకులు చిన్నయ్య, లక్ష్మీ, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి అధికారులు తోడ్పడాలి

ఎంపీపీ గుమ్మా పద్మజ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

పెద్ద దోర్నాల, జూన్ 23: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు తోడ్పడాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అన్నారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు మండలంలోని అభివృద్ధి పనులపై వివరించారు. అనంతరం ఎంపీపీ పద్మజ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మండల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం మండలంలో తాగునీటి సమస్య వేధిస్తోందని కొరతను అధిగమించేందుకు తోడ్పడాలని అన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున ఆరోగ్య శాఖాధికారులు, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి అందరు అధికారులు విధిగా హాజరు కావాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఏవో జవహర్‌లాల్ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి అనూష పాల్గొన్నారు.


భక్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

కొనకనమిట్ల, జూన్ 23 : మండలంలోని వాగుమడుగు గ్రామంలో రెండురోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. రెండురోజలుగా పోలేరమ్మ దేవతకు భక్తులు బండ్లు, పొంగళ్లతో అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో తిరునాళ్ల నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుండి క్యూలు కట్టారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా గుడి ప్రాంగణంలో టెంట్‌లు, గుడారాలు ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులరద్దీతో గుడిప్రాంగణం కిక్కిరిసింది. ఏటా ఏరువాక పౌర్ణమి రోజున పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. ఏరువా పౌర్ణమి రోజు తిరునాళ్లను నిర్వహించుకోవడం ద్వారా అమ్మవారిని ఏరువాక పోలేరమ్మగా భక్తులు పిలుచుకుంటూ దర్శించుకొని తరిస్తుంటారు. పాడిపంటలతో తమ గ్రామాన్ని చల్లగా చూడాలని మొక్కులు చెల్లించారు. తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన టీడీపీ, వైసీపీకి చెందిన విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆప్రభల వద్ద ఏర్పాటు చేసిన పాట కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాగుమడుగు గ్రామం తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని ఆత్మీయులకు భక్తులు విందు ఇచ్చారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు మోక్షం ఎప్పుడో..?


చెన్నారెడ్డిపల్లెకు, తాడివారిపల్లెకు వెళ్లే రహదారులు

తర్లుపాడు, జూన్ 23: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ప్రజలు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. తర్లుపాడు నుంచి చెన్నరెడ్డిపల్లెకు, మంగళకుంట నుంచి కొత్తూరుకు, తాడివారిపల్లె నుంచి మంగళ కుంటకు, రాఘసముద్రం నుంచి పోతలపాడుకు, మెయిన్ రోడ్డు నుంచి ఫత్తేపురం రోడ్లు మోకాళ్ల లోతు గుంతలతో దర్శనమిస్తూ, ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, బైకులు ఈ రోడ్లపై పలుమార్లు పడ్డ ఘటనలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్లకు టెండర్లు పిలిచి మెటల్ వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ రోడ్ల గురించి పట్టించుకునే నాథులే లేరు. రోడ్లకు కంకర పరవడంతో తరచూ బైకులు పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. కొత్తూరు, మంగళ కుంట రోడ్డు గురించి అనేకమార్లు అధికారులు, ప్రజలకు విన్నవించుకున్నా పట్టించు కోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ రోడ్లకు మోక్షం కలుగుతుందేమోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

● గ్రామాల్లో పారిశుధ్య లోపం ● కంపు కొడుతున్న వీధులు ● వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


రోడ్లపైకి చేరిన మురికి నీటితో త్రిపురాంతకం ప్రధాన రహదారి

త్రిపురాంతకం, జూన్ 23: వాతావరణంలో వస్తున్న మార్పులతో మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు ప్రారంభమయ్యాయి. ఉష్ణోగ్రతల్లో తేడాలతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. రోడ్లపైనే మురికి నీరు నిలబడడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామ స్థాయి అధికారులు, వైద్యశాఖ సిబ్బంది ముందు నుండే జాగ్రత్త పడి జ్వరాలను నియంత్రించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మురికినీటితో నిండిన ఓ గ్రామంలోని రహదారి

సీజనల్ వ్యాధులు ఇవే : గ్రామాలలో డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపైనే మురికినీరు నిలుస్తుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉంది. తలనొప్పి, గొంతునొప్పి, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, విషజ్వరాలు, డెంగ్యూ, బోదకాలు వంటివి ప్రబలే అవకాశాలున్నాయి.

జ్వరం : మనిషి సాధారణ శరీర ఉష్ణోగ్రత 98.6 డిగ్రీలుగా ఉంటుంది. 100 డిగ్రీలు ఉంటే స్వల్పంగాను, 102 డిగ్రీలు లోపు ఉంటే సాధారణ జ్వరంగాను, 104 డిగ్రీలు దాటితే ప్రమాదకరమైన జ్వరంగాను పరిగణించాలి.

డెంగ్యూ లక్షణాలు

మనిషికి 104 డిగ్రీలు జ్వరం వస్తే తలనొప్పి, కడుపు నొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుల్లు వస్తాయి. జ్వరం 105 డిగ్రీలకు చేరుకుంటే రోగి కోమాలోకి వెళ్ళిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

విష జ్వరాలు : ఒళ్ళు నొప్పులు, జలుబు, తుమ్ములతో జ్వరం వస్తుంది. వారం రోజుల పాటు జ్వరం తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. తలనొప్పి, చలి, నీరసం విష జ్వరాల ప్రధాన లక్షణం.

మలేరియా : మలేరియా వ్యాధికి ముందు జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. సాయంత్రం కాగానే జ్వరం తగ్గుతుంది. విపరీతంగా చలి, వణుకు వస్తాయి. చేతులు, కాళ్ళు తిమ్మిర్లుగా ఉంటాయి. వాంతులు, విరేచనాలు అవుతూ ఆకలి సరిగా ఉండదు. మనిషి పూర్తిగా నీరసిస్తాడు.

దోమలను అరికట్టే విధానం :

ఇళ్ళలోని మంచినీటి తొట్లలో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈగలు, దోమ లు ముసరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో వేస్ట్ ఆయిల్ స్ప్రే చేయాలి. దోమ తెరలను తప్పని సరిగా ఉపయోగించాలి. గ్రామాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా, లార్వా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలి

రోగాలు వ్యాపించకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. కాచి వడపోసిన నీటిని తీసుకోవాలి. రోడ్డు పక్కన అమ్మే తినుబండారాలు తినకూడదు. రోజూ జ్వరం వచ్చి తగ్గుతుంటే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. **డాక్టర్ ఎం.నాగేశ్వరనాయక్**

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మృతిచెందిన గేదె

పీసీపల్లి, జూన్ 23: పశుగ్రాసానికి వెళ్లిన రెండు గేదెలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన మండలంలోని వితలాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మడతల మద్దిరెడ్డి, శంకరమ్మ దంపతులు గేదెలు మేపుకుని పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. శంకరమ్మ ఎప్పటిలాగే ఆదివారం ఉదయం తన గేదెలను పశుగ్రాసం కోసం పొలం తోలుకెళ్లింది. గ్రామ సమీపంలో ఉన్న పొలంలో పైన హైటెన్షన్ విద్యుత్ లైన్, కింద ఎల్‌టీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఎల్‌టీ లైనుకు విద్యుత్ సరఫరాను ఇదివరకే నిలిపివేసి ఉన్నారు. పశుగ్రాసానికి వెళ్లిన గేదెలలోని ఒక గేదె గ్రాసం మేస్తూ అక్కడ ఉన్న కట్ట ఎక్కింది. కట్ట దిగుతున్న సమయంలో గేదె కొమ్ము ఎల్‌టీ లైనుకు తగలడంతో గేదె కట్టమీద నుంచి కిందకు జారింది. ఈ క్రమంలో గేదె కొమ్ముకు తగులుకుని ఉన్న ఎల్‌టీ లైను వైరు దానిపైన ఉన్న హైటెన్షన్ లైను వైరుకు తగలడంతో గేదెకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది పక్కనే గ్రాసం మేస్తున్న మరో గేదె కూడా షాక్‌కు గురై మృతిచెందింది. కుటుంబపోషణకు జీవనాధారమైన రెండు గేదెలు మృతి చెందడంతో శంకరమ్మ బోరున విలపించింది. మృతిచెందిన గేదెల విలువ 1.5 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఘటనాస్థలాన్ని విద్యుత్ ఏఈ లక్ష్మీరాజేష్ సందర్శించి బాధిత పాడిరైతును అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

వెలిగండ్ల, జూన్ 23: మండలంలో రైతులకు దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రంగాకృష్ణ సూచించారు. మండలంలో విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. కాలం చెల్లిన పురుగుమందులు, నాణ్యతలేని విత్తనాలు, నిషేధిత పురుగు మందులు దుకాణాల్లో ఉండరాదన్నారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలు, ఎరువులనే రైతులకు విక్రయించాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు విత్తన దుకాణాల్లో రిజిస్టర్లు, బిల్ బుక్కులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

పామూరు, జూన్ 23 : ఒకే దేశం, ఒకే జండా ఒకే ప్రధాని అనే నినాదంతో జాతీయ సమైక్యత కోసం తమ ప్రాణాలనే బలిదానం చేసిన గొప్ప దేశభక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దీవస్ కార్యక్రమాన్ని పామూరు, సీఎస్‌పురంలలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశ్మీర్ జైలులో శ్యాంప్రసాద్ అనుమానాస్పద మరణంపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కూడా చేపట్టలేదని ఆరోపించారు. ఇప్పటికి ఆయన మరణం అనుమానంగానే ఉందన్నారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం జూన్ 23న ఆత్మబలిదాన్ దీవస్ జరుపుకుంటున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో బీజేపీ పామూరు, సీఎస్‌పురం మండలాల అధ్యక్షులు జె.చినసుబ్బయ్య, ఇండ్ల వెంకటసత్యం, పాశం రామకృష్ణ, మన్నేపల్లి మాల్యాద్రి, డి.రాయుడు, కె.సుబ్బారావు, పాడే అరవింద్, కె.గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 23: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. మేళాతాళాలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించి భక్తులు పంచిపెట్టారు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన అధ్యక్షుడు చిన ఆదినారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బొద్దికూరపాడు విద్యార్థి


క్రీడాకారుడు శివరామకృష్ణతో పీడీ రవిప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు, జూన్ 23: రాష్ట్రస్థాయి జూనియర్ రగ్బీ టోర్నమెంట్‌లో మండలంలోని బొద్దికూరపాడు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థి గంజ శివరామకృష్ణకుమార్ ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 18 ఏళ్ల లోపు జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో భీమునిపట్నంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఈనెల 25, 26, 27 తేదీలో పూణెలో జరగనున్న జాతీయ రగ్బీ టోర్నమెంట్‌లో శివరామకృష్ణ పాల్గొననున్నట్టు పీడీ రవిప్రసాద్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రగ్బీ క్రీడాకారుడు శివరామకృష్ణను హైస్కూల్ హెచ్ఎం పి.సుబ్బారావు, విద్యాకమిటీ ఛైర్మన్ వై.కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్యాంసన్, వైస్ సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, రిటైర్ట్ టీచర్ ఎస్.అంజిరెడ్డి, సంగన యోగిరెడ్డి తదితరులు అభినందించారు.

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కురిచేడు, జూన్ 23: కురిచేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేది ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుందర రామమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

26న గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అర్హత పరీక్ష

కురిచేడు, జూన్ 23: కురిచేడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 26న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అహరోన్ రావు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో పాల్గొనే విద్యార్థులు 24వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 26వ తేది ఉదయం 10.30నుంచి 12.30 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను ఈ అర్హత పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రి రవికుమార్‌ను కలిసిన టీడీపీ నేతలు


మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న దర్శి టీడీపీ నాయకులు

దర్శి, జూన్ 23 : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను టీడీపీ దర్శి మండల మాజీ అధ్యక్షుడు బొట్ల కోటేశ్వరరావు, దర్శి మాజీ ఉపసర్పంచ్ దేవతి మహనంద తదితరులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని వారు ఈసందర్భంగా భరోసా ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషిచేసిన రామ్మూర్తి

పామూరు, జూన్ 23: విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, బీసీ రిజర్వేషన్‌ల కోసం పోరాడిన గొప్ప మానవతవాది పండిత గానాల రామ్మూర్తి అని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి అన్నారు. ఆదివారం స్థానిక విరాట్ నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గానాల రామ్మూర్తి 88వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాగేంద్రచారి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా ఉన్న రామ్మూర్తి మోకాళ్ల మీద వెళ్లి అభ్యర్థించి విశ్వబ్రాహ్మణులకు బీసీ రిజర్వేషన్లు సాధించిపెట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు ఎం.దొరసానయ్యాచారి, పట్టణ అధ్యక్షుడు తాండాయి కృష్ణ, బాలాచారి, రవీంద్రబాబు, సురేష్, శేఖర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

» పట్టించుకోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు

» ప్రయాణికులకు తప్పని పాట్లు

ముండ్లమూరు, జూన్ 23: మండలంలోని పలు గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ళ తరబడి మరమ్మతులకు నోచుకోక పోవటంతో వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. పది నిమిషాలు పట్టే ప్రయాణం కాస్త అరగంట, గంట పడుతుందంటే ఆ రహదారుల దుస్థితి అర్థమవుతుంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టనట్టుగా వ్యహరిస్తున్నారు. దీంతో నిత్యం ప్రయాణికులు ఆ రహదారులపై ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు.

మండలంలోని అతి ప్రధాన రహదారుల్లో ఒకటైన నూజెండ్లపల్లి, భట్లపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి గోతుల మయమైంది. అడుగుకొక గొయ్యి ఉండటంతో పాటు రహదారిపై తారు లేచి పోయి గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి ఆ గోతుల్లో నీరు చేరింది. వాహన చోదకులు రహదారి అంతా బాగుందని, వేగంగా వాహనాలు నడిపి గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. అధ్వానస్థితిలో ఉన్న ఈ రహదారి గురించి ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదు. భట్లపల్లి నుంచి నూజెండ్లపల్లి వరకు కేవలం రెండు కిలో మీటర్లు మాత్రమే ఉంటుంది. రహదారి అధ్వానంగా ఉండటంతో అరగంటకు పైగా ప్రయాణం పడుతుంది. నిత్యం 20 గ్రామాల ప్రజలు అద్దంకి వెళ్ళాలంటే ఈ రహదారిపైనే ప్రయాణం చేస్తుంటారు.

మండలంలోని అతి ముఖ్యమైన పెదఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళే పంచాయతీ రాజ్ రహదారి కూలా అలాగే ఉంది. తొమ్మిది కిలో మీటర్లు ఉండే ఈ రహదారికి రాజగోపాలరెడ్డి నగర్, కమ్మవారిపాలెం, ఉల్లగల్లు సమీపంలో మోకాలిలోతు గుంతలు పడ్డాయి. పెద్ద పెద్ద గొయ్యిలు పడటం వల్ల వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల రాజగోపాలరెడ్డి నగర్‌లో పనిచేసే ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోతుల్లో పడి మృతి చెందాడు. సంబంధిత అధికారులు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయకపోవటం పట్ల పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

అలాగే, పెదరావిపాడు నుంచి నాయుడుపాలెం వెళ్ళే పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా ఉంది. పది సంవత్సరాల నుంచి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. రహదారిపై తారంతా లేచిపోయి కంకర బయటపడింది. వాహనాలు టైర్లు నిత్యం పంచర్లు కావటం పరిపాటైంది. మరమ్మతులు గురించి సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవు. పెద ఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్ వెళ్ళే పంచాయతీరాజ్ శాఖ రహదారి మరింత దారుణంగా ఉంది. కనీసం మూడు కిలో మీటర్లు ఉండే ఈ రహదారి అడుగుకో గుంతగా తయారైంది. ఐదు గ్రామాల ప్రజలు ఈ రహదారిపై ప్రయాణం సాగిస్తుంటారు. రాత్రుల సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. రెడ్డినగర్ నుంచి బసవాపురం వెళ్ళే పంచాయతీ రాజ్ రహదారి కూడా అలాగే ఉంది. మండలంలోని ప్రధాన రహదారుల దుస్థితి గురించి కొత్త ప్రభుత్వమైనా పట్టించుకొని కనీసం తాత్కాలిక మరమ్మతుతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


నూజెండ్లపల్లి - భట్లపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

కనిగిరి, జూన్ 23: కనిగిరిలో ఆదివారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర సంబరాలు అంబరాన్ని తాకాయి. పెద్దఎత్తున భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణంలోని పురవీధుల్లో వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున భజనలు చేసుకుంటూ నగరంలో ఊరేగింపు నిర్వహించారు. నగరంలో ఊరేగింపు జరుగుతున్న ప్రదేశాల్లో ఆధ్యాత్మిక భావంతో అన్నివర్గాల ప్రజలు ఆంజనేయస్వామి, శివాజి విగ్రహాలను తిలకించి పూజలు చేశారు. పారువేట పోసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నా,పెద్ద కాషాయ వస్త్రాలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు.


కనిగిరిలో ఛత్రపతి శివాజీ, అభయాంజనేయస్వామి విగ్రహాల ఊరేగింపు, పాల్గొన్న భక్తులు


వాసవీ క్లబ్ కార్యదర్శి కళావతిని సన్మానిస్తున్న బాలకొండలరావు

సేవా కార్యక్రమాల్లో మహిళలు ముందుండాలి

పామూరు, జూన్ 23: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య మహిళలు ముందుండాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త కార్యదర్శి బాదం కళావతి అన్నారు. డాన్‌టు డస్క్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానానికి విచ్చేశారు. ఈసందర్భంగా దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, మంచికంటి రమేష్, శేగు కృష్ణయ్య, నారాయణ, వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారానికి కృషి


పారిశుధ్య సిబ్బందితో పూడిక పనులు చేయిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి, జూన్ 23: కనిగిరిలో పారిశుధ్య సమస్యను శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లాడేసాహెబ్ వీధిలో ఆయన పర్యటించారు. చెత్త నిలిచిపోయిన సైడ్ డ్రైనేజిల్లో పూడిక పనులు చేపట్టారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇంటిలోని చెత్తా చెదారాలను సైడు కాల్వల్లో వేస్తుండటంతో చెత్త పేరుకు పోతుందన్నారు. తద్వారా మురుగు నిలిచిపోయి దోమలు ప్రభలే అవకాశముందన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తలను పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని 20 వార్డులలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల బిల్లుల కోసం ప్రదక్షిణలు

» నిధుల విడుదలలో అధికారుల జాప్యం

» ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు

దర్శి, జూన్ 23: దర్శి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో వివిధ పనులు చేపట్టిన నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. నిధులు విడుదల ఆయినప్పటికీ అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. దర్శి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ, కౌంటింగ్ జూన్ 4వ తేది నాటితో ముగిసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా భోజనాలు, ఫ్లెక్సీలు, పర్నిచర్ తదితర పలురకాల పనులను వ్యాపారులు సొంత నిధులతో సమకూర్చారు. నిధులు విడుదలయిన తర్వాత బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు ఇచ్చిన హామీ మేరకు వారు పనులు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి 20 రోజులు గడుస్తున్నప్పటికీ అనేక మందికి ఇంకా బిల్లులు ఇవ్వలేదు. నిర్వాహకులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్కడ అధికారులు అందుబాటులో లేక ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిదులు విడుదల చేసినట్లు సమాచారం. గతంలో ఎన్నడూలేని విధంగా రూ.1.5 కోట్ల నిధులు విడుదల అయినట్లు తెలిసింది. అయి నప్పటికీ స్థానిక అధికారులు సక్రమంగా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండటంతో నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈవిషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా నిధులు డిప్యూటీ తహసీల్దార్ అకౌంట్‌కు జమ అయ్యాయని తెలిపారు. తహసీల్దార్ పర్యవేక్షణలో బిల్లులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కొంతమందికి ఇంకా బిల్లులు అందలేదనే విషయం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

» ఏపీ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

హనుమంతునిపాడు (కనిగిరి), జూన్ 23: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి పిలుపునిచ్చారు. హనుమంతునిపాడు మండలం పెద్దముప్పళ్ళపాడు గ్రామంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి రైతు మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ స్వామినాధన్ కమిటీ సిఫారసులను అమలుచేయాలని, కనీస మద్దతు ధరలకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు నెలకు రూ10వేలు చొప్పున పెన్షన్, ట్రాక్టర్‌లకు 50శాతం రాయితీపై డీజిల్, సాగుసాయం కింద రూ.15 వేలు తెలంగాణ తరహాలో అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల దృష్ట్యా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ సవరించి రూ.3 లక్షల లోపు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. రూ.ఐదు లక్షల లోపు పావలా వడ్డీ కింద రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కార్డులు మంజూరుచేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని, 90శాతం సబ్సిడీ కింద ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు నికర జలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జీపీ రామారావు, ఖాసింవలి, పవన్‌కల్యాణ్, ఆర్.రామయ్య, నాగేశ్వరరావు, రాజ్యం, గుండాబత్తుని రమణయ్య, పి.సుబ్బారావు, సిద్ధయ్య, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రైతు సంఘం నేత వీరారెడ్డి

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూన్ 23: గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండలాల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామపూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్‌రావులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, జూన్ 23: మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. ముండ్లమూరు, పోలవరం, పసుపుగల్లు, నూజెండ్లపల్లి, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవతా మూర్తులను ప్రత్యేక అలంకరణ చేశారు.

'సురక్ష' సంచులు బూడిదపాలు

» సిబ్బంది దహనం చేస్తుండగా వ్యాపించిన మంటలు

కనిగిరి, జూన్ 23: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జగనన్న సురక్ష పేరుతో ముద్రించిన ఖాళీ సంచుల బారీ బండిళ్ళు ఉన్నాయి. ఆయా సంచుల గోతాలను ఆదివారం వేకువ జామున వైద్య సిబ్బంది కాల్చి వేస్తుండగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి.

కనిగిరి ప్రభుత్వాసుపత్రికి గత ప్రభుత్వంలో ఆసుపత్రిలో అందించే వైద్యంలో భాగంగా రోగులకు అవసరమయ్యే మందులను ఆయా సంచుల్లో పెట్టి ఇవ్వాల్సి ఉంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యమే కరువైంది. కేవలం ప్రచారం కోసం జగన్ ప్రభుత్వం చేసిన లక్షలాది రూపాయలు ఖర్చు ఎందుకు పనికి రాకపోగా, ఆయా మందులు, రోగులకు ఇచ్చే మందు లు కూడా పక్కదోవ పట్టాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం మారడంతో ఆసుపత్రి వైద్యులు సిబ్బందిచే పెద్ద పెద్ద బండిళ్ళలో ఉన్న సురక్ష సంచులను కాల్చివేయాలని సూచించినట్లు సమాచారం దీంతో సిబ్బంది పోస్టుమార్టం గది వద్ద ఉన్న చెత్తకుండీలో వేసి దహనం చేశారు. బారీ బండిళ్ళు కావటంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఆసుపత్రిలో పెద్ద ఎత్తున మంటలు పైకెగసి పడుతుండటంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రి వద్దకు పరుగులు తీశారు. తీరా చూస్తే జగనన్న సురక్ష సంచులు మంటల్లో కాలి బూడిదవుతున్న సంఘటనను చూసి స్థానికులు నివ్వెరపోయారు.


సంచులను దహనం చేయడంతో పోస్టుమార్టం గది వద్ద వ్యాపించిన మంటలు

నేడు చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణం

తాళ్లూరు, జూన్ 23: మండలంలోని లక్కవరం గ్రామంలో శ్రీగంగా భ్రమరాంబా సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థాన 601 వార్షికోత్సవ కల్యాణం సోమవారం జరుగనున్నట్లు ఆలయ అర్చకులు నడింపల్లి ప్రకాష్‌పంతులు తెలిపారు. భక్తులు కల్యాణ కార్యక్రమాన్ని తిలకించాలని కోరారు. టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణోత్సవ కార్యక్రమానికి రానున్నారని ఆపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.





తాడేపల్లి బోటుయార్డులో నిర్మాణాన్ని బుల్డోజర్లతో కూల్చుతున్న దృశ్యం

గలీజు నిర్మాణాలు

రోడ్డులేదని గుంటూరులో వెనకడుగు

వైసీపీ జిల్లా కార్యాలయాన్ని గుంటూరులో సర్వహంగులతో నిర్మించేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరిగాయి. అయితే తాము కోరిన స్థలానికి సరైన అప్రోచ్ రోడ్డు లేదని వైసీపీ నాయకులు వెనకడుగు వేశారు. దీంతో అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎదురుగా ఉన్న సుమారు 2,500 చదరపు గజాల స్థలం తిరిగి నగరపాలక సంస్థకు దక్కింది. రూ.10 కోట్ల విలువ చేసే నగరపాలకసంస్థ ఆస్తిని 33 ఏళ్ల పాటు నామమాత్రపు లీజుతో కాజేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కార్పొరేషన్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇక్కడ చదరపు గజం విలువ రూ.40 వేలు ఉన్న విలువైన ఆస్తిని అధికార పార్టీ కొట్టేయాలని చూడటంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ పెద్దఎత్తున ఆందోళనలు కూడా నిర్వహించింది. అయితే ఈ స్థలానికి అప్రోచ్ రోడ్డు కేవలం 15 అడుగులు మాత్రమే ఉండటంతో కొన్ని రోజుల తర్వాత వైసీపీ వెనకడుగు వేసింది. దాంతో ఆ స్థలం ప్రతిపాదన దశలోనే నిలిచిపోయింది. అదే కార్యరూపం దాల్చి ఉంటే ఈ పాటికే నగరపాలకసంస్థ ఆస్తి వైసీపీ స్వాధీనంలోకి వెళ్లిపోయి ప్యాలెస్ నిర్మాణం ప్రారంభమై ఉండేదే.

బాపట్లలో అనుమతి లేకుండానే..

బాపట్ల నడిబొడ్డున ఆర్టీసీ గ్యారెజీ పక్కన ఉన్న రెండెకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి 2022 డిసెంబరులో కేటాయించారు. దీనిపై కేటాయించడం అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చినా అటు అధికారులు, ఇటు వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. ఆ స్థలం తమదని, అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు అప్పట్లో పోలీసులకు, రెవెన్యూ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత శంకుస్థాపన సమయంలో ఎంపీ మోపిదేవి, ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలోనే వారు అభ్యంతరం కూడా తెలిపారు. స్థలం తొలుత తమదేనని వాదించి ఫిర్యాదులు కూడా చేసిన ఆర్టీసీ అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదు. పైగా ఏపీఐఐసీకి ఆ స్థలం ఎప్పుడో అప్పగించినట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. అప్పటి ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావు స్థలం విషయంలో విచారణ జరుపుతున్నామన్నారు. ఈ క్రమంలో ఆ స్థలం ఆర్టీసీది కాదని, ఏపీఐఐసీదని వారి చేతే చెప్పించారు. ఏపీఐఐసీకి చెందిన 10.62 ఎకరాలను 1990లో ఆర్టీసీ కొనుగోలు చేసిందని, ఇందులో దాదాపు 6 ఎకరాల్లో డిపో నిర్మించగా మిగతాది ఖాళీగా ఉంది. 2003లో ఆ మిగిలిన స్థలాన్ని ఏపీఐఐసీ తన పారిశ్రామిక అవసరాల కోసం వెనక్కి తీసుకుందని, అది తెలియక ఆర్టీసీ అధికారులు తమదనే వాదన చేశారని అప్పటి వైసీపీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. స్థలం విషయంలో జరిగిన తంతు ఇలా ఉంటే పట్టణం నడిబొడ్డున రాజప్రసాదం లాంటి భవంతి నిర్మాణం జరుగుతుంటే దానికి అనుమతి ఉందా లేదా అనే అంశంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించలేదు. అధికారుల అలక్ష్యంతో ప్లాన్ అప్రూవల్ లేకుండానే భవన నిర్మాణం జరిగిపోయింది. ఈ రోజుకు కూడా ఆ భవనానికి మున్సిపాలిటీ అనుమతి లేదనేది సమాచారం.



◆ బాపట్ల : ఏపీఐఐసీ భూమిలో నిర్మించిన రాజప్రసాదం లాంటి వైసీపీ జిల్లా కార్యాలయం ఇదే

అధికారం మాది.. మరో ముప్పై ఏళ్లు మేమే పాలకులం.. మేం చెప్పిందే చట్టం.. అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు.. అన్నట్లుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగిందనేందుకు ఎన్నో నిదర్శనాలు వెలుగుచూశాయి. వైసీపీ నియంతృత్వ పాలనకు జిల్లా కేంద్రాల్లో చేపట్టిన పార్టీ కార్యాలయాలే నిదర్శనంగా నిలుస్తాయి. రూ.కోట్ల విలువైన స్థలాలపై కన్నేసి.. కారుచౌక లీజులకు తీసుకుని.. అభ్యంతరాలు చెప్పిన వారిపై కేసులతో నోరు మూయించి.. సరైన అనుమతులు లేకుండా జగన్ రాజరికపు ధోరణికు అనుగుణంగా ప్యాలెస్‌లను మరిపించేలా వైసీపీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలు జరిగాయి. జిల్లా కేంద్రాల్లో భారీగా చేపట్టిన నిర్మాణాలపై ఏ శాఖ అధికారి కూడా కన్నెత్తి చూసే సాహసం చేయలేదంటే వైసీపీకి ఏ రీతిగా అధికారులు ఊడిగం చేశారో వారి కార్యాలయాల నిర్మాణాలను చూస్తే అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై కనీసం నోటీసు ఇవ్వకుండా అధికారులు కళ్లు మూసుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సామాన్యుడు గూడు కోసం ప్రభుత్వ స్థలం ఆక్రమించినా.. అనుమతి లేకుండా నిర్మాణం చేపడితే నానాహడావుడి చేసే అధికారులు వైసీపీ కార్యాలయాల విషయంలో కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ప్రభుత్వ భూముల్లో చేపట్టిన వైసీపీ కార్యాలయాలపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్లు ప్రజల నుంచి వ్యక్తమవుతుండడంతో స్థలాల కేటాయింపు అంశం తాజాగా తెరపైకి వచ్చింది.

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట (ఆంధ్రజ్యోతి)/ తాడేపల్లి టౌన్, జూన్ 23: రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు వైసీపీ పరమయ్యాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని చీకటి జీవోలతో విలువైన స్థలాలను కారుచౌక లీజులకు కొట్టేసి వైసీపీ జిల్లా కార్యాలయాలతో ప్యాలెస్ తరహా భవనాలను నిర్మించుకుని పాగా వేశారు. పారదర్శకంగా జరగాల్సిన భూ కేటాయింపు విషయాన్ని అత్యంత గుంభనంగా జరిపిన అధికారులు అధికార పార్టీకి వంతపాడారు. ఏదైనా భవనం కట్టాలంటే పలు అనుమతులు, నిబంధనలు అమలు చేయాలి. అయితే అవేవీ లేకుండానే కొన్ని దగ్గర్ల, తూతూమంత్రపు అనుమతులతో మరి కొన్ని దగ్గర్ల వైసీపీ నేతలు రూ.కోట్లు వెచ్చించి కార్యాలయాలను నిర్మించారు. ఇవేదో మారుమూల ప్రాంతాల్లో అయితే ఎవరికీ కానరాలేదు.. చర్యలు తీసుకోలేదు అనుకోవచ్చు. కానీ ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలోనే వైసీపీ కార్యాలయాల నిర్మాణాలు జరిగాయి. అధికార దుర్వినియోగానికి వైసీపీ కార్యాలయాలకు స్థలాల కేటాయింపు, భవన నిర్మాణాలు బరితెగింపునకు నిదర్శనాలుగా ఉన్నాయన్న విమర్శలు పలువర్గాల నుంచి వస్తున్నాయి. అధికారం చేతిలో ఉండడంతో అన్ని వ్యవస్థలను చెరబట్టి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుని కోట్ల విలువ గల స్థలాల్లో కార్యాలయాలను నిర్మించారు. ప్రధాన కూడళ్లలో స్థలాలను గుర్తించడం.. వాటి కోసం వైసీపీ నేతల నుంచి దరఖాస్తు వచ్చిందే తడవుగా ఆగమేఘాల మీద స్పందించిన ప్రభుత్వం సదరు స్థలాల్ని పార్టీకి కట్టబెడుతూ రహస్యంగా జీవోలుజారీ చేయగా అంతేవేగంగా రూ.కోట్లు వెచ్చించి ప్యాలెస్ తరహాలో కార్యాలయాలను నిర్మించుకున్నారు.

అడ్డగోలు నిర్మాణాలు

వైసీపీ జిల్లా కార్యాలయం కోసం బాపట్ల నడిబొడ్డున కేటాయించిన రెండెకరాల స్థలం విషయంలో జగన్ ప్రభుత్వం వేసిన పిల్లిమొగ్గలు అనీఇన్నీకావు. బాపట్ల జిల్లాకు ఒక్క పరిశ్రమ తేలేని వైసీపీ ప్రభుత్వం ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) పరిధిలోని రెండెకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని 33 ఏళ్లకు ఏడాదికి రూ.వెయ్యి లీజుకు అప్పగించేసింది. ఈ స్థలం తమదని ఆర్టీసీ అభ్యంతరం వ్యక్తం చేసి ఫిర్యాదు చేయగా తర్వాత జరిగిన పరిణామాల్లో ఫిర్యాదు చేసిన ఆర్టీసీ అధికారిపై పాలకపార్టీ చర్య తీసుకుంది. కనీసం బిల్డింగ్ కట్టడానికి మున్సిపాల్టీ నుంచి కూడా అనుమతులు తీసుకోకుండా వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇక నరసరావుపేటలో ఖాళీ స్థలాల లీజుకు మంచి గిరాకీ ఉంది. ఇటీవల ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలం లీజుకు వేలం నిర్వహించగా 10/15 అడుగులకు నెలకు రూ.3 వేలు అద్దె చెల్లిస్తున్నారు. పల్నాడు రోడ్డులో ఐదు సెంట్ల ప్రైవేట్ ఖాళీ స్థలానికి రూ.39 వేలు అద్దె చెల్లిస్తున్నారు. అలాంటిది వైసీపీ కార్యాలయానికి ఇచ్చిన ఒకట్నిర ఎకరా స్థలానికి ఏడాదికి రూ.1500 అద్దెకు కేటాయించడం చూస్తే ప్రభుత్వ బరితెగింపు అర్థమవుతుంది. 33 ఏళ్లకు స్థలం లీజుకు కేటాయిస్తూ జీవో 360ను వైసీపీ ప్రభుత్వం జారీ చేసింది.



నరసరావుపేటలో ప్రభుత్వం స్థలంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

నరసరావుపేటలో రూ.25 కోట్ల స్థలంలో..

రూ.కోట్ల స్థలాలు కారుచౌకగా కొట్టేశారు

- ప్రభుత్వ స్థలాల్లో వైసీపీ ప్యాలెస్‌ల నిర్మాణం
- అనుమతులు లేకుండా అడ్డగోలుగా పనులు
- బాపట్లలో మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఏపీఐఐసీకి చెందిన స్థలంలో కార్యాలయ నిర్మాణం
- నరసరావుపేటలో కలెక్టరేట్‌కి సమీపంలో కార్యాలయం
- గుంటూరులో రూ.10 కోట్ల స్థలంపై కన్నేసి వెనక్కి తగ్గారు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో దాదాపు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం పార్టీకి అప్పనంగా అప్పచెప్పింది. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి ఎదురు రోడ్డులో రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్ల పక్కన ఎకరం రూ.15 కోట్లకు పైగా ఉన్న ఒకటిన్నర ఎకరాలో వైసీపీ నాయకులు దర్జాగా కార్యాలయాన్ని నిర్మించారు. రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్లలో పల్నాడు జిల్లా ఆవిర్భావం తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాంతంలోని స్థలంపై కన్నేసిన వైసీపీ నాయకులు పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఒకటిన్నర ఎకరా స్థలం లీజుకు ఇవ్వాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తు వచ్చిందే తడవుగా ఆగమేఘాల మీద స్పందించిన ప్రభుత్వం సదరు స్థలాన్ని పార్టీకి కట్టబెడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ జీవో ఆధారంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్లాన్ కోసం దరఖాస్తు చేయగా లింగంగుంట్ల పంచాయతీ అధికారులు అనుమతి ఇచ్చారు. 2022 మే 22న స్థలాన్ని తహసీల్దార్ అప్పగించగా అదే సంవత్సరం డిసెంబరులో స్థలం లీజు రూ.49,500 పిన్నెల్లి చెల్లించారు. ఆ వెంటనే దాదాపు రూ.2 కోట్లతో అన్ని హంగులతో పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి భవన నిర్మాణానికి నిధులు సమకూర్చారు. పంచాయతీ మినహా మరే అనుమతులు భవన నిర్మాణానికి లేవు. వైసీపీ కార్యాలయం నిర్మించడంతో స్వగృహ అపార్ట్‌మెంట్లలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

వైసీపీ కబ్జా నుంచి విముక్తి

రహస్య జీవోతో, నామమాత్రపు లీజుతో, రూ.కోట్ల విలువ చేసే స్థలంపై కన్నేసి పార్టీ కార్యాలయం పేరుతో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించడంతో వైసీపీ కబ్జా నుంచి తాడేపల్లిలోని బోట్ యార్డు స్థలానికి విముక్తి లభించింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీతానగరంలో నీటిపారుదల శాఖకు చెందిన బోట్ యార్డు స్థలం సర్వే నెంబరు 202/ఏ-1లో రెండు ఎకరాల భూమిని ఏడాదికి రూ.1000 వంతున 33 ఏళ్లకు, వైసీపీ పార్టీ కార్యాలయ ఏర్పాటుకు లీజ్‌కు గత ఏడాది ఫిబ్రవరి 23న జగన్ సర్కార్ జీ.వోను తీసుకువచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో అనుమతులు లేకుండా గుట్టుగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టగా అప్పట్లో టీడీపీ, జనసేన నాయకులు ఆందోళనతో తాత్కాలికంగా పనులు ఆపారు. తిరిగి ఇటీవల ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించి రెండు ఫ్లోర్లు నిర్మించేందుకు పిల్లర్లు సిద్ధం చేశారు. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా నిర్మాణ పనులు మాత్రం ఆగలేదు. ఎన్నికలు పూర్తి అయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వైసీపీ కార్యాలయ భవన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులతో ఎట్టకేలకు అధికారులు శనివారం ఉదయం బుల్డోజర్లతో కూల్చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ భూమికి విముక్తి కలిగిందని తాడేపల్లివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చీరాలలో దారుణ హత్య

● పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన



కంచర్ల సంతోష్ (పాత చిత్రం)

చీరాలటౌన్, జూన్ 23: చీరాలలో పట్టపగలు దారుణ హత్య జరిగింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీరాల మునిసిపల్ పరిధిలోని పాపరాజుతోటలో నివాసం ఉంటున్న కంచర్ల సంతోష్(30) స్థానిక సంగం థియేటర్ సమీపంలో రెండేళ్లుగా అయ్యప్ప క్యాటరింగ్ పేరుతో కర్రీస్ పాయింట్ నడుపుతున్నాడు. అయితే సంగం థియేటర్ వద్ద ఉన్న వీరి షాపు ఎదురుగా బెస్తపాలెంకు చెందిన జోగి యూసఫ్ అలియాస్ చిన్నా తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తున్నాడు. ఇతని దగ్గర గత కొంతకాలంగా స్వర్ణకు చెందిన ఉమామహేశ్వరరావు పనిచేస్తున్నాడు. ఆదివారం అక్కడ ఉన్న మంచినీటి ట్యాపు వద్ద చిన్నా చేతులు కడుగుతుండగా ఆ నీళ్లు కర్రీస్ పాయింట్ వైపు వచ్చాయి. దీంతో సంతోష్ తల్లి పైడిరోజు చిన్నాతో వాదనకు దిగింది. ఆ సమయంలో చిన్నా, సంతోష్ మధ్య వివాదం చోటుచేసుకుంది. వారిద్దరూ వాదులాడుకుంటుండగానే దుకాణంలో కూలీగా పనిచేసే ఉమామహేశ్వరరావు జేబులో ఉంచుకున్న పండ్లు కోసే చాకుతో సంతోష్ పొట్టలో, వెనుక భాగంలో పొడిచాడు. బాధితుడు సంతోష్ శరీరం నుంచి తీవ్రంగా రక్తస్రావమవుతుండటంతో పరుగులు తీసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ గేటు వద్దకు చేరి కేకలు వేశాడు. బయటకు పరిగెత్తుకుంటూ వచ్చిన పోలీసులు సంతోష్‌ను ప్రైవేట్ వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యులు చికిత్స అందిస్తుండగానే సంతోష్ ప్రాణాలు విడిచాడు. దీంతో తల్లి పైడిరోజు, భార్య నవ్య, అక్క లావణ్యతో పాటు బంధువులు హాస్పిటల్ వద్దకు చేరి విలపించారు. వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



రక్తపు గాయాలతో పోలీస్ స్టేషన్ గేటుముందు రోదిస్తున్న సంతోష్

పొట్టకూటికి వచ్చి కానరాని లోకాలకు..

మృతుడి తల్లి పైడిరోజు, తండ్రి వెంకటరావులకు పెద్దకుమారుడు సత్యన్నారాయణ, రెండో కుమారుడు సంతోష్, లావణ్య సంతానం. వీరి స్వగ్రామం అరకు వద్ద డముకు. సుమారు 15 ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం చీరాలకు వచ్చారు. మూడు చోట్ల కర్రీస్ పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే దురదృష్టవశాత్తు నాలుగేళ్ల క్రితం పెద్ద కుమారుడు సత్యనారాయణ కాలు జారి పడి ప్రాణాలు విడిచాడు. ప్రస్తుతం తల్లిదండ్రులకు సంతోష్ అండగా ఉంటున్నాడు. ఆదివారం జరిగిన దారుణంలో ఉన్న ఒక్క కుమారుడిని కోల్పోవడంతో వారు బోరున విలపిస్తున్నారు. మృతుడు సంతోష్‌తో నవ్యకు రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది.

సముద్రస్నానం.. విషాదం

రామాపురంలో మంగళగిరికి చెందిన ఇద్దరు మృతి

మంగళగిరి సిటీ: వేటపాలెం మండల పరిధిలోని తీరప్రాంతం విషాదాలకు నెలవుగా మారుతోంది. సముద్రంలోకి దిగి గల్లంతై మృత్యువాత పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఆదివారం మంగళగిరి నుంచి రామాపురం వచ్చిన 12 మంది మిత్ర బృందంలో సముద్రంలో మునిగి ఇద్దరు మృతి చెందారు. మంగళగిరి కుప్పురావుకాలనీ, భార్గవపేటకు చెందిన 12 మంది స్వర్ణకార వృత్తి చేసుకునే యువకులు ఆదివారం సముద్ర స్నానానికి రామాపురం సముద్ర తీరానికి వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానం చేస్తూ సరదాగా నాత్నారు. ఈ సమయంలో మిత్ర బృందంలోని పడవల బాలసాయి(26), కొసనం బాలనాగేశ్వరరావు(25) అలల ఉధృతికి గల్లంతయ్యారు. మిత్రులు వారిని గుర్తించి రక్షించి చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇద్దరు యువకులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలసాయికి సుమారు మూడేళ్ల క్రితం పెళ్లి కాగా మూడు నెలల పాప ఉంది. బాలనాగేశ్వరరావు అవివాహితుడు. యువకుల మృతి వార్త తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు హుటాహుటిన చీరాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతులు బాలనాగేశ్వరరావు, బాలసాయి

నారా లోకేశ్ దిగ్ర్భాంతి

బాలసాయి, బాలనాగేశ్వరరావులు మృతిపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు వున్న ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మంత్రులు అనిత, రవికుమార్‌లు ఆదేశించినా..

రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో జరుగుతున్న అపశ్రుతులు, అందుకు ప్రాణాలను మూల్యంగా చెల్లిస్తున్న ఘటనలపై మంత్రులు వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్‌లు గత శుక్రవారం స్పందించారు. మైరైన్ పోలీస్, లాఅండ్‌ఆర్డర్ పోలీసులు, రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ అధికారులు సంయుక్త కార్యాచరణతో చర్యలు చేపట్టి మరణాలను నివారించాలని ఆదేశించారు. ఆ తరువాత తాజాగా ఆదివారం మరో ఇద్దరు రామాపురం తీరంలో మృతి చెందటం బాధాకరం. జరుగుతున్న వరుస ఘటనలలో ఉన్మాదం, నిర్లక్ష్యం, మత్తుపదార్థాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వాటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిఘా నిరంతరం కొనసాగించాలి.



అధ్వాన స్థితిలో చిలకలూరిపేట మేజర్ కాలువ

సాగర్ కాలువలకు.. మోక్షం

● మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ● రూ.22.54 కోట్లకు ప్రతిపాదనలు ● 473 పనులు గుర్తించిన జలవనరుల శాఖ

ఉగ్గో ఆంధ్రజ్యోతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాలువల పరిధిలోని కాలువల్లో నీరు పారే పరిస్థితి లేదు. అధ్వానంగా ఉన్న కాలువల బాగుకు ప్రభుత్వం స్పందిం చింది. పాడుబెట్టారు.. పట్టించుకోండి అనే శీర్షికతో కాలువల అధ్వాన స్థితిపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. కాలువల మర్మమతులకు ప్రతి పాదనలు కోరారు. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ 473 పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు మంత్రికి అందజేసింది. నాలుగేళ్ల పాటు మరమ్మత్తులకు నిధుల విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం కాలువలను గాలికొదిలేసిన విషయం తెలిసిందే.

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిలస్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారనున్నాయి. తక్షణావసర మైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనా లను రూపొందించారు. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ మేరకు సదరు అధికారులు జలవనరుల శాఖ మంత్రికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పనులు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

473 పనులు గుర్తించారు..

కుడికాలువ పరిధిలో ఈ ఏడాది కాలువలకు మర్మమత్తులు నిర్వహిం చేందుకు జల వనరుల శాఖ 473 పనులను గుర్తించింది. ఇందుకు సంబం దించిన వ్యయం అంచ నాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాలువల్లో పూడికతీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొం దించారు. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 153 పనులు ఇందుకు వ్యయం అంచనా రూ.7.63 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 133 పనులు వ్యయం అంచనా రూ.6.38 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 107 పనులు వ్యయం అంచనా రూ.5.09 కోట్లు. లింగంగుంట్ల మనిటరింగ్ డివిజన్ పరిధిలో 24 పనులు వ్యయం అంచనా రూ.2.12 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 56 పనులు వ్యయం అంచనా రూ.2.29 కోట్లు. మొత్తం 473 పనులకు రూ.22.54 కోట్లు వ్యయం అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



రామాపురం తీరంలో మరో విషాదం

- ఇద్దరిని కబళించిన కెరటాలు
- మృతులు మంగళగిరి వాసులు


పడవల బాల సాయి (ఫైల్)


బాలనాగేశ్వర రావు (ఫైల్)

రామాపురం(చీరాలటౌన్), జూన్ 23: వేటపాలెం మండలం రామాపురం తీరంలో మరో విషాదం చోటుచేసుకుంది. ఆదివారం సరదాగా సముద్రస్నానం చేసేందుకు వచ్చిన వారిలో ఇద్దరిని కెరటాలు కబళించాయి. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పడవల బాలసాయి(26), కొసనం బాలనాగేశ్వరరావు(27), గోవర్ధన్, బాలు, టపాసు, ప్రేమ్‌కుమార్, జయంత్, రాజా, సాయి, మేకల సాయి మరో ఇద్దరు బంగారు వస్తువులు తయారీ చేస్తుంటారు. వీరంతా ఆదివారం రామాపురంలో సముద్రంలో మునిగేందుకు మూడు కార్లలో వచ్చారు. వీరిలో ఏడుగురు సీబ్రిడ్జ్ సమీపంలో సముద్రంలోకి దిగారు. బాలసాయి, బాల నాగేశ్వరరావు అలలు తాకిడికి కొట్టుకుపోయారు. ఆదేసమయంలో గోవర్ధన్ కూడా కొట్టుకుపోతుండగా ప్రేమ్‌కుమార్ అతడిని కాపాడాడు.

సమాచారం అందుకున్న మెరైన్, రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే బాలసాయి, బాల నాగేశ్వరరావు మృతదేహాలు అదేప్రాంతంలో ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల్లోని బాలసాయిది చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పాతసినిమా హాలు సెంటర్. సుమారు పదేళ్ల క్రితం వ్యాపార రీత్యా తల్లిదండ్రులు మంగళగిరిలోని భార్గవ్ నగర్‌కు మకాం మార్చారు. ఆయనకు భార్య , నాలుగు నెలల పాప ఉన్నారు. బాల నాగేశ్వరరావుకు ఇంకా వివాహం కాలేదు. ఆదివారం జరిగిన ఈఘటనతో కలిపి గడచిన 20 రోజుల్లో రామాపురం వద్ద ఏడుగురు సముద్రంలో అలల తాకిడికి మృత్యువాత పడ్డారు.

రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు


శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరాలయంలో క్రీ.శ. మూడో శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్లను ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఈ జిల్లాలో వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలన్న అవగాహన కార్యక్రమంలో ఆదివారం ఆయన రామతీర్థంలో పర్యటించారు. ఆలయం వెనుక వైపున ఉన్న శివలింగాల మధ్య పల్నాటి సున్నపురాతి బౌద్ధ స్తంభాన్ని, దానిపై అర్ధచంద్రకార పద్మాన్ని కనుగొన్నారు. ఈ శిల్పం ఇక్ష్వాకుల కాలం నాటిదని గుర్తించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ, వేంగ చాళుక్యుల కాలంలో ఈ స్తంభాన్ని బ్రహ్మసూత్రాలు చెక్కి, శివలింగంగా మార్చి బిగించారని పేర్కొన్నారు. మరో రెండు శివలింగాలు, క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన వీరభద్ర విగ్రహం నిరాదరణకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు.

రైల్వే, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23 : నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రైల్వే అసిస్టెంట్ కో పైలెట్, ఆర్ఆర్‌బీ టెక్నీషియన్స్, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఒంగోలులోని లాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు డైరెక్టర్ పాలపర్తి విజయ్‌భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ, యువతీ, యువకులు తమ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 29వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 7207012758 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలి

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని జైశ్రీకృష్ణ బీసీ సమితి నాయకురాలు పద్మశ్రీసంతోష్‌యాదవ్ పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బీసీ విద్యార్థులకు ప్రోత్సాహక, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగింది. 2024 పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీసంతోష్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో చదువుకుని మంచి మార్కు లు సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకోసం జై శ్రీకృష్ణ బీసీ సమితి అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ సాధించిన విద్యార్థులను ఇదే విధంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ.ర మణకుమార్, అడకా స్వాములు, డాక్టర్ కాకు శ్రీకాంత్ యాదవ్, రవికిరణ్ పిచ్చయ్య, పేగడ శ్రీని వాసకృష్ణ, రంజిత్ కుమార్, గురు ప్రసాద్, బంకా చిరంజీవి పలువురు పాల్గొన్నారు.

బాలినేని అక్రమాలపై విచారణ జరపాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 23: గత ఐదు సంవత్సరాలలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని రంగాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలి నేని అనుచరులు భూకబ్జాలు చేస్తూ దొంగ రిజి స్ట్రేషన్లతో నగరంలో అనేక భూములు ఆక్రమించారని ఆరోపించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి బం,ధువు నిర్మిస్తున్న విల్లాల లెవలింగ్ కోసం అక్ర మంగా కోట్లాది రూపాయల గ్రావెల్ తరలించటం, వాగుపోరం బోకును కలుపుకోవటంపై దర్యాప్తు జరపాలన్నారు. బాలినేని పేకాట, బెట్టింగ్ వంటి వ్యసనాలకు లోనై ఒంగోలు అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. 80శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు ఇవ్వలేదని, నగరానికి దూరంగా 450 ఎకరాలు మార్కెట్ ధర కన్నా రె ట్టింపు ధరతో కొనుగోలు చేశారని, అందులో రూ. 50 కోట్ల దోపిడీ జరిగిందని లక్ష్మణరెడ్డి చెప్పారు.

సుపరిపాలన ఉపాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల సుబ్బా రావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గా న్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబె ట్టుకోవాలన్నారు. ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షు డు కొల్లా మధు మాట్లాడుతూ మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేయాలని, ఒంగోలు నగరంలో మాస్టర్ ప్లాన్‌ను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. రిటైర్డ్ పోలీసు అధికారి సుంకర సాయి బాబు మాట్లాడుతూ జిల్లాలో సైనిక్ స్కూలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ న్యాయవాది ఎన్.దేవకుమారి మాట్లాడుతూ ఒంగోలు కా ర్పొరేషన్ నగర ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించటం లేదని, అధిక పన్నులు వసూలు చే స్తున్నారని ఆరోపించారు. అనంతరం నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మా ట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరి గితేనే ద్వారానే వలసలు ఆగుతాయని చెప్పారు. అయితే దీనిని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆ యన విమర్శించారు.


టీడీపీ హయాంలోనే మహిళలకు రక్షణ

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 23: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మహిళలకు రక్షణ లభిస్తుందని తెలుగు మహిళలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈపురుపాలెంలో ఓ మహిళలపై అత్యాచారం జరగ్గా, బాధితురాలికి అండగా ఉండేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత నేరుగా సంఘటన జరిగిన ఊరికి వెళ్లారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు దృష్టికి తీసుకెళ్ళగా, స్పందించిన సీఎం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చడం అభినందనీయమని పేర్కొన్నారు. అంతేగాకుండా 36 గంటల్లోనే నిందుల ను అదుపులోకి తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారని తెలిపారు. సమావేశంలో రావుల పద్మజ, నిడమనూరు పావని, బీరం అరుణరెడ్డి, పసుపులేటి సునీత, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గలీజు

- అధికారుల సంపూర్ణ సహకారం
- ఖాళీ స్థల పన్ను విషయంలో నిబంధనలు సడలింపు
- భవన నిర్మాణానికి అనుమతులు వచ్చిన తర్వాత పైసా చెల్లించని ఆపార్టీ నేతలు
- ఇప్పటి వరకూ రూ.14.35లక్షల బకాయి
- అక్రమంగా కొళాయిలు వేసి స్వామిభక్తిని చాటుకున్న కార్పొరేషన్ అధికారులు

వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఐదేళ్లు సాగించిన అడ్డగోలు వ్యవహారాలు బయటపడుతున్నాయి. జగన్‌పాలనలో ఆయన కోసం తాడేపల్లి ప్యాలెస్, రుషికొండ ప్యాలెస్‌లు కట్టేసి ప్రజాధనం దుర్వినియోగం చేయగా.. పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం ఒంగోలులో వైసీపీ నేతలు మరింత బరితెగించారు. వారి ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గారు. రూ.కోట్ల విలువైన 1.64 ఎకరాల భూమిని కారుచౌకగా లీజుకు కట్టబెట్టారు. పన్నుల చెల్లింపు నుంచి ప్లాన్ అనుమతి వరకూ మున్సిపల్ ఉన్నతాధికారులు నిబంధనలు సైతం సడలించి స్వామిభక్తిని చాటుకున్నారు. ఇటు పన్ను, అటు ప్లాన్ అనుమతికి భారీ రాయితీలు ఇచ్చారు. అయినప్పటికీ వైసీపీ నేతలు తమ వక్రబుద్ధిని ప్రదర్శించారు. నిర్మాణాలకు అనుమతి వచ్చినప్పటి నుంచి పైసా పన్ను చెల్లించకపోవడంతో రూ.14.35లక్షల బకాయి పేరుకుపోయింది. అయినప్పటికీ ఆ కార్యాలయం వద్ద మునిసిపల్ అధికారులు ఆరు కొళాయిలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.


నూతనంగా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయం

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 23 : జగన్ ప్రభుత్వం చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఐదేళ్లపాటు అవకాశం ఉన్నచోటల్లా ఇష్టారాజ్యంగా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడిన వైసీపీ పెద్దలు.. పార్టీ కార్యాలయ నిర్మాణంలోనూ అవకతవకలకు పాల్పడ్డారు. ఒంగోలులో అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ స్థలాలను సొంత పార్టీ కార్యాలయానికి మార్చుకోవడమే కాకుండా, కార్యాలయ భవనం పన్ను విధింపుల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారు. అధికార పార్టీ ఆదేశాలకు ప్రభుత్వ అధికారులు సైతం తలూపారు.

నగరంలోని దక్షిణ బైపాస్ (ఎన్నెస్పీ కార్యాలయం పక్కన) సర్వే నెం. 17లోని ప్రభుత్వ స్థలంలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణంలో అడ్డగోలు వ్యవహారమే నడిచింది. అటు రెవెన్యూ, ఇటు కార్పొరేషన్ అధికారులు సైతం సహకరించారు. సుమారు 7,934 చదరపు గజాలు (1.64ఎకరాలు) ఎన్నెస్పీ భూమిని రెవెన్యూ అధికారులు వైసీపీకి అప్పనంగా కట్టబెట్టారు. వైసీపీ కార్యాలయానికి కేటాయించిన ఈ భూమి విలువ సుమారు రూ.4.50 కోట్లు ఉంటుంది. ఏడాదికి ఎకరాకు రూ.1000 అద్దె ప్రకారం 33 ఏళ్ల లీజుకు రాసిచ్చారు. జె.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరున ఫైలును నడిపారు. కార్యాలయానికి భూమి కేటాయింపు అనంతరం జరిగిన తతంగంలో అంతా అక్రమాలే జరిగినట్లు తెలుస్తోంది.

పన్ను చెల్లింపుల్లో అవకతవకలు

ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపట్టాలంటే జీవో ప్రకారం మొదటిసారే ఏడు వాయిదాలు ఖాళీ స్థలం పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించాలి. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత యూసేజ్ సర్టిఫికెట్ పొందుపరిచి పన్ను తగ్గించుకోవాల్సి ఉంటుంది. అయితే వైసీపీ కార్యాలయ నిర్మాణం విషయంలో రాష్ట్ర పురపాలక శాఖ అధికారులే కథ నడిపించారు. నేరుగా డీఎంఏ కార్యాలయం జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ప్లాన్ పొందాలంటే పన్ను రశీదు పొందుపరచాల్సి ఉంది. అందుకోసం ఒకేసారి ఏడు వాయిదాల వీఎల్‌టీ చెల్లించాలి. ఈ నేపథ్యంలో డీఎంఏ కార్యాలయం నిబంధనలను సైతం సడలించి వైసీపీ కార్యాలానికి లీజుకు తీసుకున్న భూమికి ఒక వాయిదా పన్ను చెల్లించేలా వెసులుబాటు ఇచ్చింది. అందుకు ఆన్‌లైన్‌లో అవసరమైన మార్పులు చేసినట్లు సమాచారం. పార్టీ పెద్దల ఆదేశాలలో కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలానికి పన్ను ఒక వాయిదాకి రూ.3,42,904 విధించి, అసెస్‌మెంట్ నెం.10350652250 కేటాయించారు.

అనుమతుల్లేకుండా కొళాయిలు

సామాన్యులు తాగునీటి కొళాయి కావాలంటే అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టే అధికారులు వైసీపీ పెద్దల మెప్పు కోసం స్వామి భక్తిని చాటుకున్నారు. ఖాళీ స్థలంగా ఉండగానే, పన్ను బకాయిలు పేరుకుపోయినప్పటికీ వైసీపీ జిల్లా కార్యాలయానికి సుమారు ఐదు వరకు అక్రమ కొళాయిలు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ఇంటి పన్ను రశీదు పొందాక కొళాయికి దరఖాస్తు చేసుకుంటే వర్క్ ఆర్డరు ఇవ్వాలి. 'అధికారం మాదే.. అడిగేవారు ఎవరు' అన్నట్లు వైసీపీ పెద్దలు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఏకంగా ఐదు కొళాయిలు వేసేశారు.

రూ.14.35లక్షల పన్ను బకాయి

జిల్లా వైసీపీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి జె.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరున ఫైలును నడిపారు. ఎన్నెస్పీకి చెందిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు వైసీపీ పెద్దలకు కట్టబెట్టగా, నిర్మాణ పనులకు కార్పొరేషన్ కార్యాలయ అధికారులు సహకరించారు. 24/12/2022న సుమారు 1.64 సెంట్ల భూమికి కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలం పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) విధించారు. ఒక వాయిదాకి రూ.3,42,904 చెల్లించాల్సి ఉండగా ప్లాన్ కోసం డీఎంఏ ఇచ్చిన వెసులుబాటు ప్రకారం ఒక వాయిదా చెల్లించారు. అనంతరం భవన నిర్మాణానికి 2023 జూలై 21వ తేదీన అనుమతులు పొందారు. ఆతర్వాత అసలు పన్ను చెల్లించడం మానేశారు. దీంతో ఇప్పటి వరకు రూ.14,35,060 బకాయి పెండింగ్‌లో ఉంది. కార్పొరేషన్ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలోనే గండిపడింది.

విద్య, వైద్యరంగాలకు పెద్దపీట

- నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యం
- విస్తృతంగా ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు
- 'ఆంధ్రజ్యోతి'తో కొత్త కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తానని నూతన కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా చెప్పారు. అదేసమయంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతకు కూడా ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఇక ప్రభుత్వ ప్రాధాన్య పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కర్తవ్యమన్నారు. జిల్లాకు 38వ కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా ప్రస్తుతం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తన ప్రాధాన్యతలను వివరించారు. తమిళనాడుకు చెందిన తమీమ్ అన్సారియా 2015 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. చెన్నైలో బీఈ కంప్యూటర్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆమె తొలుత 2013లో సివిల్స్ గ్రూప్ ఏ గ్రేడ్‌లో అకౌంటెన్సీ పోస్టు సాధించి కేంద్ర ప్రభుత్వంలో పనిచేశారు. 2015లో ఐఏఎస్‌గా ఎంపికైన ఆమెను యూపీ కేడర్‌కు కేటాయించారు. కొంతకాలం కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ సెక్రటరీగా కూడా పనిచేశారు. కాగా ఆంధ్ర కేడర్‌లో పనిచేస్తున్న జమ్మూకశ్మీర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి మునజీర్ జిలానీతో వివాహం అనంతరం తమీమ్ అన్సారియా కూడా ఆంధ్ర కేడర్‌కు మారారు. అలా 2020లో రాష్ట్రానికి వచ్చాక తొలుత విశాఖపట్నంలో పనిచేశారు. అనంతరం శ్రీశైలం కేంద్రంగా స్పెషల్ కలెక్టర్‌గా ఏడాదిన్నర, తదనంతరం 2022 ఏప్రిల్ నుంచి ఏడాదిపాటు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

ఆతర్వాత దాదాపు ఏడాది కుటుంబపరమైన సెలవులో ఉన్నారు. ఈఏడాది జనవరి 29న శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులై ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్నారు. తొలుత కేంద్ర సర్వీసులలో పనిచేసిన సమయంలో విద్యాశాఖలో ఉన్న తమీమ్ అన్సారియా ఆ రంగానికి పెద్దపీట వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే సాధారణ ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యతలుగా చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం, మొత్తం యంత్రాంగం సహకారంతో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. సాధారణ ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

రెండు, మూడు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు తీసుకోనున్నట్లు తమీమ్ అన్సారియా చెప్పారు.

స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ


సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 23 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యతన ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో కనిగిరి, చీరాల, దర్శి, ఎర్రగొండపాలెం, శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎంఎం.కొండయ్య, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆయా సంఘాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. ముందుగా 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధి శాఖ, 1,7 స్థాయీ సంఘాలైన పనులు, ఆర్థిక విషయాలపై సమీక్షించారు. అనంతరం 3,4 స్థాయీ సంఘాలు వ్యవసాయం, విద్య, వైద్యంపై, 5,6 స్థాయీ సంఘాలైన స్త్రీ,శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం మొదలైన శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి సి.హనుమంతరావు, మారెడ్డి అరుణ, చుండి సుజ్ఞానమ్మ పాల్గొన్నారు.

దర్శికి మహర్దశ

- జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి రూ.18.51 కోట్లు
- నిధులు విడుదల చేస్తూ రవాణా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి తొలిసంతకం
- నెరవేరనున్న దర్శి ప్రాంత ప్రజల కల


పునాదుల్లో నిలిచిపోయిన డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రం

దర్శి, జూన్ 23: దర్శి ప్రాంత ప్రజల కలలు నెరవేరుతున్నాయి. టీడీపీ అధికారంలోకి రాగానే హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణానికి రూ.18.51 కోట్లు నిధులు విడుదల చేసింది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టాక నిధులు విడుదల చేస్తూ తొలిసంతకం చేశారు. అనంతరం ఆయన సీఎం చంద్రబాబుకు ఈ విషయాన్ని వివరించారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా దీనిపై నిర్లక్ష్య వైఖరి అవలంబించింది. టీడీపీ హయాంలో ఆరంభించారనే అక్కసుతోనే వైసీపీ పాలకులు చాలారోజులు పట్టించుకోలేదు. మధ్యలో కొంతమేర కదలిక వచ్చినప్పటికీ పనులు ప్రారంభించిన పాపాన పోలేదు. స్థానిక వైసీపీ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లను బెదిరించటంతో వారు చేతులెత్తేశారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పాతటెండర్లు రద్దు చేసి పలుసార్లు రీటెండర్లు పిలిచింది. వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలనను గుర్తించిన కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఒక్కరు కూడా టెండరు కోడ్ చేయలేదు. ఇక డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం అటకెక్కినట్లేనని ప్రజలు ఆశలు వదులుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ప్రజలు ఊహించిన విధంగానే దర్శి నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యత కల్గిన జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రానికి నిధులు విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, టీడీపీ కూటమి తరుపున పోటీచేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రైవింగ్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అందులోభాగంగా సీఎం చంద్రబాబు చొరవతో నిధులు వెంటనే విడుదలయ్యాయి.

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణానికి నిధులు విడుదల చేయటం పట్ల టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు సీఎం చంద్రబాబుకు, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈచర్య ద్వారా కూటమి ప్రభుత్వం చేతల సర్కారు అని రుజువైందన్నారు. దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని విధాల సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తారని వారు స్పష్టం చేశారు.

రేషన్ షాపుల కోసం పోటీ

- జనసేన, బీజేపీ నేతల నుంచి కూడా ఒత్తిళ్లు
- ఈసారి పాత డీలర్లకే రేషన్ కేటాయించే అవకాశం

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 23 : జిల్లాలో రేషన్ షాపుల కోసం పోటీ పెరిగింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి భారీ విజయం సాధించడంతో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు అన్ని విషయాల్లో సముచితస్థానం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ ద్వితీయశ్రేణి నేతలతోపాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా తమ అనుచరులకు రేషన్ షాపులను ఇప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రేషన్‌షాపుల కోసం అధిక డిమాండ్ ఏర్పడటంతో ఇప్పటికిప్పుడు వాటిని కేటాయించే పరిస్థితి లేకుండాపోయింది. ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు పౌరసరఫరాల గిడ్డంగుల నుంచి నిత్యావసర సరుకులను సరఫరా ప్రారంభమైంది. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న డీలర్లకే ఈనెల సరుకుల పంపిణీ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్‌షాపులు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల వారీగా షాపులు కేటాయించాలంటే స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు రావాల్సి ఉంది. పరిస్థితులకు అనుగుణంగా ఈ రేషన్ షాపులను కేటాయించాలి. ఇంకోవైపు ఎన్‌డీఏ కూటమిలో జనసేన, బీజేపీ కూడా ఉండటంతో వారితో కూడా నియోజకవర్గాల వారీగా చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీంతో రేషన్ షాపుల కేటాయింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న డీలర్లకే నిత్యావసర వస్తువులను కేటాయింపు చేయనున్నట్లు తెలిసింది.



మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వ్యవసాయ మార్కెట్లను వికేంద్రీకరించాలి

● ఆశాఖ మంత్రిని కలిసి కోరిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూన్ 23: రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, పశు సంవర్ధక డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం మర్యాదపూర్వకంగా విజయవాడ మంత్రి స్వగృహంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ అభివృద్ధికి విశేష కృషిచేయాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌లను వికేంద్రీకరించాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ ఉందని , నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం అని అన్నారు. ఉన్న ఆరు మండలాలు సుదూరప్రాంతాలుగా విస్తరించి ఉన్నాయన్నారు. మార్టూరు, యద్దనపూడి మండలాలకు మార్టూరు మార్కెటింగ్ యార్డు, పర్చూరు, కారంచేడు మండలాలకు పర్చూరు మార్కెటింగ్ యార్డు, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలకు చిన్నగంజాం మార్కెట్ యార్డులుగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రైతాంగానికి అండగా నిలవాలని, అన్నదాతల అభ్యున్నతికి కృషిచేయాలని ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, టీడీపీ నాయకులు కోడెల శివరాం తదితరులు ఉన్నారు.



పొంగళ్లు నెత్తి మీద పెట్టుకొని ఊరేగింపుగా వెళుతున్న మహిళలు, నాయకులు, పసుపు జెండాలతో అలంకరించిన అమ్మవారి ప్రభ

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు

చినగంజాం, జూన్ 23 : మండలంలోని పెదగంజాం గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో పర్చూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం సాధిస్తే పోలేరమ్మకు మొక్కులు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో పూజలు నిర్వహించినట్లు తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి తెలిపారు. ఎన్నికలలో ఎమ్మెల్యే ఏలూరి విజయం సాధించడంతో ఆదివారం ఉదయం పెదగంజాంలోని పోలేరమ్మ, జాలమ్మ, అంకమ్మ అమ్మవార్ల దేవాలయాల్లో టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. తదనంతరం పసుపు జెండాలతో అలంకరించిన పోలేరమ్మ అమ్మవారి ప్రభను ట్రాక్టర్‌పై ఉంచి, ప్రభ ముందు మహిళలు పొంగళ్లు నెత్తి మీద పెట్టుకొని మేళతాళాలు, కనకతప్పెట్లతో గ్రామ పుర వీధులలో ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానం వద్దకు వెళ్లారు. అనంతరం నాయకులు, మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పోలేరమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. టీడీపీ నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, పోలిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కుబడి కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాలు కొనసాగిస్తాం

బల్లికురవ, జూన్ 23: సేవా సమితి ద్వారా ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని చిట్టిపోతు, చిడిపోతు సేవాసమితి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య తెలిపారు. మండలంలోని ఉప్పుమాగులూరు, ప్రకాశం జిల్లా పరిధిలోని టంగుటూరు చిడిపోతు, చిట్టిపోతు వంశస్థుల సేవా సమితి సమావేశం ఆదివారం గుంటూరులో జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసిన ఏడాదిలోనే ఐదుగురు విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈఏడాది మరో విద్యార్థికి సహకారం అందించామన్నారు. రానున్న రోజుల్లో చిడిపోతు, చిట్టిపోతు వంశస్థుల పిల్లల విదేశీ విద్యకు వెళ్లాలంటే తమను సంప్రదిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. అలాగే ప్రతి ఏటా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో టంగుటూరు పొగాకు బోర్డు ఛైర్మన్ చిట్టిపోతు యశ్వంత్ కుమార్, ఆడిటర్ మస్తానయ్య, నాసరయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మస్తానయ్య

ఇంకొల్లు సమస్యలపై మోదీకి ఈ మెయిల్

ఇంకొల్లు,జూన్ 23: పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంకొల్లు ప్రాంతంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని ఆత్మ నిర్భర్ భారత్‌లోకి చేర్చాలని,అదే విధంగా భారంగా టోల్‌ట్యాక్సులు, డీజిల్ ధరలు తగ్గించాలని విన్నవిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి ఈ మెయిల్ ద్వారా ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంబొట్ల మోహనకృష్ణ విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో సమస్యలు పరిష్కరించాలని అందులో కోరినట్లు తెలిపారు.

టీడీపీ నేత కేవీకి మంత్రి గొట్టిపాటి పరామర్శ

పంగులూరు, జూన్ 23 : టీడీపీ సీనియర్ నాయకులు కేవీ సుబ్బారావును రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. చందలూరు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు కేవీ సుబ్బారావు కొద్ది రోజుల క్రితం అస్వస్థతతో ఒంగోలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి ఆదివారం ఒంగోలు చేరుకుని వైద్యశాలలో చికిత్స పొందుతున్న సుబ్బారావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట టీడీపీ నేతలు శింగమనేని శ్రీనివాసరావు, బాలిన రామసుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, గరిమిడి జగన్మోహనరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు వరపర్ల సుబ్బారావు, చందలూరు గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, మాజీ సర్పంచ్ ఉన్నం రవిబాబు, మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి కాజా ఉన్నారు.



టీడీపీ నేత సుబ్బారావును పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా

మంత్రి గొట్టిపాటి రవికుమార్

మేదరమెట్ల , జూన్ 23 : అద్దంకి నియోజకవర్గ చరిత్రలో ఎన్నడు లేని విధంగా భారీ మెజార్టీతో గెలిపించిన అద్దంకి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మేదరమెట్లలో ఉన్న ఆయన్ను కొరిశపాడు మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ అభిమానాన్ని చాటి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో భాగం పంచుకునే విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్ననని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారింస్తానన్నారు. విద్యుత్ సరఫరాపై అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేసి రైతులకు, పారిశ్రామిక వేతలకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి విద్యుత్ శాఖకు మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. అద్దంకి నియోజవర్గంలోని రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటి సంబంధించిన పథకాలు పూర్తి చేయిస్తానన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, స్థానిక సమస్యలను పరిష్కారించేందుకు ప్రణాళికతో ముందుకు సాగడం సాగుతానని ఆయన హామీ ఇచ్చారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మొక్కను ఇచ్చి అభినందనలు తెలుపుతున్న బాపట్ల అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, రిటైర్డ్ డీఆర్‌వో నాగబాబులు మంత్రిని కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు.బాప్ల, అద్దంకి సీతాలు ఆంజనేయులు,మస్తాన్‌రావు, రావినూతల, కుర్రవానిపాలెంకు చెందిన తెలుగు మహిళలు రవికుమార్‌కు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రాంగణం అంత కిక్కిరిసిపోయింది. ప్రతి ఒక్కరిని మంత్రి రవికుమార్ ఓర్పుతో పలకరిస్తూ ఫొటోలు దిగుతూ మూడు గంటల సేపు వారితో గడిపారు. అభినందనలు తెలపడానికి రావడంతో పాటు వ్యక్తిగత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అందరికి నవ్వుతూ సమాధానాలు చెప్పారు.



మంత్రి రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న రావినూతల తెలుగు మహిళలు

మంత్రిని కలిసిన పలువురు

మొక్కు తీర్చుకున్న సర్పంచ్ శాంతి

బల్లికురవ, జూన్ 23: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు ఉపసర్పంచ్‌గా ఉన్న శాంతి సర్పంచ్‌గా నియమితులయ్యారు. దీంతో ఆదివారం ఆమె అన అనుచరులతో కలసి సాగర్ వద్ద మేరీ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ ఎంపిక కావటంతో తాము మేరీ మాత వద్ద మొక్కు చెల్లించుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.



మేరీ మాత ఆలయం వద్ద సర్పంచ్ శాంతి, కుటుంబసభ్యులు



ముప్పవరం టీడీపీ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటిని సత్కరిస్తున్న మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రి గొట్టిపాటిని కలిసిన గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు

పంగులూరు, జూన్ 23 : మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటిని ఘనంగా సత్కరించారు. గ్రానైట్ పరిశ్రమలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, గౌరవాధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు, హనుమప్రసాద్, కోశాధికారి పుచ్చకాయల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరి కె.గోపి, ఉపాధ్యక్షులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను ఏరేస్తాం !

అధికారులూ సక్రమంగా పనిచేయండి ...

లేకుంటే వెళ్లిపోండి..

ఎమ్మెల్యే కొండయ్య సున్నిత హెచ్చరిక

చీరాల, జూన్ 23 : 'నియోజవకర్గంలో అసాంఘిక శక్తులను ఏరిపారేస్తాం. జరిగిన, జరుగుతున్న సంఘనలపై ఉక్కుపాదం మోపుతాం. ఎవరిని ఉపేక్షించేది లేదు. తీరప్రాంతంలో రిసార్ట్స్ నిర్వహకులు పర్యాటకుల భద్రత బాధ్యతను తీసుకోవాలి. అలా కాదనే రిసార్ట్‌లకు తాళాలు వేయిస్తాను. రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు చెక్ చెప్తాం. అందుకు డిపార్ట్‌మెంట్‌పరంగా కఠినంగా వ్యవహరిస్తామని' ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య హెచ్చరించారు. అధికారులు సక్రమంగా పనిచేయండి. లేదా వెళ్లిపోండి. మీ అంతట మీరు వెళితే సంతోషం. నేను పంపిస్తే వీఆర్(వేకెన్సీ రిజర్వ్‌డ్)నని కొండయ్య స్పష్టం చేశారు. ఆదివారం వేటపాలెం మండలం రామాపురం తీరంలో మంగళగిరికి చెందిన 12 మంది బంగారు పనివారు ఆటవిడుపుగా వేటపాలెం మండలం రామాపురం వచ్చారు. సముద్రంలో దిగిన నేపథ్యంలో ఇరువురు ప్రమాదకరస్థితికి చేరారు. వారు మృతి చెందారు. ఇదిలా ఉంటే చీరాల సంగం థియేటర్ సమీపంలో సంతోష్ అనే క్రరీస్ పాయింట్ వ్యాపారి, పండ్ల వ్యాపారి మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో పండ్ల వ్యాపారి సంతోష్‌ను కత్తితో పొడవటంతో మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై ఎమ్మెల్యే కొండయ్య ఘాటుగా స్పందించారు. ఏరియా వైద్యశాలలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. ఆ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఈపురుపాలెంలో యువతి రేప్, హత్యకు సంబంధించి గంటల వ్యవధిలో హోం మినిస్టర్, ఎమ్మెల్యేగా తాను సీఎం చంద్రబాబు ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టడంతో పాటు, నిందితులను పట్టుకోవటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చీరాల నియోజకవర్గంలో ఏం జరిగిందనేది తనకు అనవసరమని, ఇకపై అసాంఘీక శక్తులు ఎక్కడ అలజడి సృష్టించాలని ప్రయత్నించినా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

గంజాయి బ్యాచ్‌లకు వెన్నులో వణుకు పుట్టిస్తామన్నారు. అందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు అప్రమత్తం కావాలన్నారు. ఎన్నికల వేళ కొందరు తన పైనే దాడి చేయటానికి ప్రయత్నించారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనే కోణంలో పరిశీలించి కఠినతరంగా వ్యవహరిస్తామని ఘాటుగా చెప్పారు. మంగళగిరి అంటే మంత్రి లోకేష్ నియోజకవర్గం నుంచి వచ్చిన వారికి ఇలా జరగటం కలిచివేచిందన్నారు. జరిగిన నష్టం పూడ్చలేనిది. అయితే ఇవే ఆఖరి ఘటనలు కావాలని చెప్పారు.

రిసార్ట్స్ నిర్వాహకులు, అధికారులతో సమీక్ష జరిపి తగిన చర్యలు చేపడతాం. వారు సక్రమంగా స్పందిస్తే సరేసరి. సాకులు చెప్పి తప్పించుకోవాలని చూస్తే వాటికి తాళాలు వేయిస్తామని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



తీరప్రాంతంలోని రిసార్ట్స్ నిర్వాహకులు, పోలీస్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రిసార్ట్స్ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 23 : రిసార్ట్స్ నిర్వాహకులు తీర ప్రాంతంలో జరిగే అపశ్రుతులకు సంబంధించి బాధ్యతగా వ్యవహరించాలని, జరుగుతున్న ప్రాణనష్టాలకు తమకు సంబంధం లేదని తప్పించుకునే మాటలు చెప్పొద్దని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య స్పష్టం చేశారు. రామాపురంలో జరుగుతున్న వరుస మరణాలపై కొండయ్య యుద్ధప్రాతిపదికన స్పందించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, టూటౌన్ సీఐ సోమశేఖర్, వేటపాలెం, ఈపురుపాలెం ఎస్సైలతో కలసి తీర ప్రాంతంలోని రిసార్ట్స్ ప్రతినిధులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న ఘటనలు, అందుకు ప్రాణాలు మూల్యంగా చెల్లించాల్సిన పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. హెచ్చరిక బోర్డులు, గజ ఈతగాళ్లు, రిసార్ట్స్ నిర్వాహకులు తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రమాదాలు జరగటానికి గల కారణాలు వంటి అంశాల గురించి చర్చించారు. అంతిమంగా రిసార్ట్స్ నిర్వహకులు సమష్టి బాధ్యత తీసుకునే అంశాలు కొన్నికాగా, ఎవరికివారు ప్రత్యేకంగా తీసుకోవాల్సిన బాధ్యతలు మరికొన్నిగా విభజించి వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. జరిగే ప్రమాదాలు, మరణాలు మన ప్రాంతానికి చెడ్డపేరు తెస్తాయని, అలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందిరిపై ఉందన్నారు. లేదంటే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఈ ప్రమాదాలపై ఉదాసీనంగా ఉండటం కుదరదని కొండయ్య తేల్చి చెప్పారు. పోలీస్‌శాఖ పరంగా డీఎస్పీ పలు సూచనలు చేశారు. వాటిని పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సజ్జా హేమలత, రిసార్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏరియా హాస్పటల్ వద్ద మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఎమ్మెల్యే కొండయ్యకు మంత్రి లోకేష్ ఫోన్

● ఇద్దరు మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి

చీరాల, జూన్ 23 : వేటపాలెం మండలం రామాపురంకు ఆదివారం మంగళగిరి నుంచి వచ్చిన యువకుల బృందంలో ఇరువురు సముద్రంలో గల్లంతై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. వివరాలు తెలుసుకుని లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే వారికి ఎలాంటి సహాయం అవసరమైనా చేయాలని కొండయ్యకు సూచించారు. వెంటనే కొండయ్య వేటపాలెంలోని రామాపురం తీరంలో సంఘటన జరిగిన ప్రదేశాన్ని డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌తో కలసి పరిశీలించారు. డిపార్ట్‌మెంట్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కొంత స్పష్టత ఇచ్చారు. అంతకు ముందు సంతోష్ అనే యువకుడి హత్యకు సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకున్నారు. రౌడీలు, అల్లరిమూకలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపి, ఎక్కడికక్కడ ఏరివేయాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే ఆమంచి

చీరాల, జూన్ 23 : చీరాల మండలం ఈపురుపాలెంలో యువతిపై హత్యాచారం ఘటనకు సంబంధించి ప్రభుత్వాన్ని నిందించం. కాని నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటన మరెక్కడా పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మృతురాలి కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ ఘటనకు సంబంధించి దుండగులను శిక్షించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి యుద్ధప్రాతిపదిక శిక్షపడేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గంజాయి, మాదకద్రవ్యాల మూలాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మృతురాలి చెల్లెలుకు ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హంతకులకు శిక్ష పడేలా చర్యలు

● వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధుల డిమాండ్

చీరాల, జూన్ 23 : మత్తు పదార్థాలకు బానిసలైన నరహంతకులకు త్వరతగతిని కఠిన శిక్ష పడేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఈపురుపాలెం సీతారాంపేటలో హత్యాచారానికి గురైన యువతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, మేడా వెంకట్రావు, దామర్ల శ్రీకృష్ణ, వాసా పల్లపరాజు, కేవీ శేషయ్య నేత, జడ్పీటీసీ పద్మిని, బండ్ల వెంకటేశ్వరరావు(బాబు), కూర్మా రాహుల్, సిద్ధి బుచ్చేశ్వరరావు, రామనాదం పరమేశ్వరరావు, తాళ్ల మోహనకృష్ణ, వృద్ధి ఆదిశేషు, వలకుల మోహనరావు పాల్గొన్నారు.

పద్యం పుట్టిన నేలపై పురస్కారం ఓ భాగ్యం

అద్దంకిటౌన్, జూన్ 23: పద్యం పుట్టిన గడ్డపైన, ఎర్రాప్రగడ నడయాడిన అద్దంకి నేలపైన పురస్కారం అందుకోవడం ఒక భాగ్యంగా భావిస్తున్నానని ఆధ్యాత్మిక ప్రవచన కర్త, వైదిక వాఙ్మయ పరిశోధకులు, రచయిత పోలూరి వెంకట శివరామప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవాసదన్‌లో సాహితీ మిత్రమండలి అద్దంకి ఆధ్వర్యంలో ఆత్మీయ పురస్కార సభ లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా రామోజీరావుకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు శివరామ ప్రసాదరావు రచనలు, కథలు, గ్రంథాలను పరిచయం చేశారు. శివరామప్రసాదరావు ఆధ్యాత్మిక ప్రవచన కర్తఅని, బ్రహ్మ సూత్రాలు, వేదవాఙ్మయం, ఉపనిషత్తులు వంటి ఆధ్యాతిక గ్రంథాలను ఆంధ్రానువాదం చేయడంతో పాటు రసోచితమైన వ్యాఖ్యలతో, సరళవ్యవహారిక శైలిలో పాఠకలోకానికి అందిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. భారతీయత హైందవ సంప్రదాయక పరిమళమని, మన ఇతిహాసాలైన రామాయణ, భారతాలు మనిషిలోని సౌజన్యాన్ని, సౌశీల్యాన్ని పెంపొందిస్తాయని, ఆధ్యాత్మిక గ్రంథాలు మనసుకు ప్రశాంతతను చేకూరుస్తాయని అన్నారు. అనంతరం శివరామ ప్రసాదరావు దంపతులను సత్కరించి ఆత్మీయపురస్కారాన్ని మిత్రమండలి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డీవీఎం సత్యనారాయణ, చప్పిడి వీరయ్య, మురళిసుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవచనకర్త వెంకట శివరామ ప్రసాదరావు

చక్రాయపాలెంలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత

అద్దంకి, జూన్23: మండలంలోని చక్రాయపాలెంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వైసీపీకి చెందిన యువకుడు చించి వేసినట్లు టీడీపీ శ్రేణులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన వైసీపీ యువకుడు టీడీపీ ఫ్లెక్సీ చించి వేసి వెళ్తుండగా టీడీపీ శ్రేణులు చూసి కేకలు వేశారు. అయితే అప్పటికే ఆ యువకుడు జారుకున్నాడు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో పాటు ఆదివారం పోలీస్ స్టేషన్ లో టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేశారు.



చక్రాయపాలెంలో ముక్కలుగా చించివేసిన టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

చీరాల, జూన్ 23 : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ ప్రతినిధులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పేద విద్యార్థులకు బుక్స్ పంపిణీ, వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ, ఒకరికి తోపుడు బండి తదితరాలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ క్లబ్ అందిస్తున్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సుదర్శన్, మువ్వల వేణు, శివకుమార్, సురేష్‌బాబు, రవిచంద్ర, అనురాధ, బాలాజి, రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, శ్యాంసుందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. వేటపాలెం మండల పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

380 మందికి వైద్యపరీక్షలు

పంగులూరు, జూన్ 23 : స్థానిక రోటరీక్లబ్ ప్రాంగణంలో జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 380 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరి అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటివైద్యశాల పెదకాకాని గుంటూరు వారు రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వీరిలో 220 మందికి శుక్లాల శస్త్ర చికిత్స అవసరంగా గుర్తించినట్లు డాక్టర్ యం. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 24న వందమందిని, 26న వంద మందిని , 28న 20 మందిని ప్రత్యేక వాహనంలో శంకర్ కంటి వైద్యశాలకు తీసుకువెళ్ళి ఉచితంగా శుక్లా ఆపరేషన్‌లు చేయిస్తామని రోటరీక్లబ్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, కాలేషావలి, ఫీల్డ్ వర్కర్ రాంబాబు, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, క్లబ్ ప్రతినిధులు పోలిశెట్టి సీతారామయ్య, పెంట్యాల జగదీశ్వర్, వెంకట రామారావు, పోతిన ప్రసాద్, చిలుకూరి వెంకటరమణ పాల్గొన్నారు.




కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శాంతి, ఐక్యతతో ముందుకు సాగాలి

ఇంకొల్లు,జూన్ 23: సమాజంలో శాంతి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడానికి హిందూ,ముస్లిం, క్రైస్తవులు అందరూ కలిసి మెలిసి ఉండాలని ముస్లిం మతపెద్దలు సందేశమిచ్చారు. ఇంకొల్లు కడవకుదురురోడ్డులోని నూతనంగా నిర్మించిన ఆక్సా మసీదును ఆదివారం మతపెద్దల సమక్షంలో ప్రారంభించారు. అందరూ కలిసి ఉండాలనే భావన పెంపొందించుకునేందుకు మసీదు ప్రారంభోత్సవానికి హిందూ,క్రిస్టియన్ సోదరులను పిలిచి మనమందరం ఒకటేనని చాటి చెప్పామన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ- ఇద్దరికి గాయాలు

మార్టూరు, జూన్ 23: మండల పరిధిలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయం ఎదురుగా ఆదివారం సాయంత్రం సర్వీసురోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయపడ్డారు. యద్దనపూడి మండలం చిమటావారిపాలెంకు చెందిన సాంబయ్య ద్విచక్రవాహనంపై మార్టూరు వైపు నుంచి హైవేపై వస్తూ ఏలూరి క్యాంపు కార్యాలయంలోకి వచ్చేందుకు సర్వీసురోడ్డులోకి వచ్చారు. అదే సమయంలో మార్టూరు నుంచి సర్వీసు రోడ్ లో కోనంకి గ్రామానికి చెందిన తాళ్లూరి నాగార్జున ద్విచక్రవాహనంపై కోనంకి వెళుతుండగా వారిద్దరి వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాంబయ్యకు గాయాలు కాగా నాగార్జున అనే యువకునికి తలకు తీవ్రగాయం అయ్యింది. అనంతరం నాగార్జునను కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మార్టూరు ముస్లిం కాలనీలో సంచరిస్తున్న వీధి కుక్కలు

మార్టూరులో వీధి కుక్కల బెడద

మార్టూరు, జూన్ 23: మార్టూరు గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువయ్యింది. గ్రామంలోని కొన్ని వీధులలో గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి.ముఖ్యంగా రాత్రిపూట మాటువేసిన కుక్కలు పాదచారులపై దాడి చేస్తున్నాయి.బలరాం కాలనీలో రాత్రి సమయంలో పాదచారులపై, ద్విచక్రవాహనదారులపై కుక్కలు వెంటబడుతున్నాయి. ముస్లింకాలనీలో పట్టపగలు సైతం వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నపిల్లలపై ఊరకుక్కలు దాడిచేస్తున్నాయి. విద్యానగర్, మద్దిసీతాదేవినగర్, కోరీగుంతలు, అంబేడ్కర్ నగర్‌లలో కుక్కల బెడద ఎక్కువగా ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు వీధికుక్కల బెడద నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాలు

వైభవంగా వెంగమ్మ తిరునాళ్ల ప్రారంభం

- అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు
- పసుపు దంచేందుకు పోటీ పడ్డ మహిళలు
- వలసవాసుల రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 23: రాష్ట్రంలోనే పేరుగాంచిన దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వెంగమాంబ వంశస్తులయిన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకువచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వేదపండితులు అమ్మవారికి పుష్పాలంకరణ చేసి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలతో హోమాలు చేయించారు. అనంతరం కలశాలను మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య అమ్మవారి సన్నిధికి చేర్చారు. మొదటి రోజు దూరప్రాంతాల నుంచి భక్తులు అధికంగా హాజరయ్యారు. పలువురు మహిళలు భక్తితో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని మహిళలు అమ్మవారి సన్నిధిలో వరపడ్డారు. వెంగమాంబ దేవర ఇంట్లో జరిగిన పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

● పసుపు దంచేందుకు పోటీ

వెంగమాంబ స్వగ్రామం వడ్డిపాళెంలోని పచ్చవ దేవర ఇంట్లో పసుపు దంచే కార్యక్రమం వైభవంగా జరిగింది. పసుపు దంచే కార్యక్రమంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. సంతానం లేని మహిళలు కూడా పసుపు దంచేందుకు పోటీ పడ్డారు. పచ్చవ దేవర ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, ఆలయ ఈవో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మొక్కుబడి ఉన్న భక్తులు కుటుంబ సమేతంగా తల నీలాలు సమర్పించుకున్నారు. కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్‌ఐలు ఉమాశంకర్, తిరుపతయ్య తమ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.



కలశాలను అమ్మవారి సన్నిధికి తీసుకువస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు



వడ్డిపాళెంలోని దేవర ఇంట్లో పసుపు దంచుతున్న భక్తులు

ఉత్సవాల్లో నేడు

సోమవారం వెంగమాంబ దంపతుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామోత్సవంలో బాణసంచా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

● గ్రామాల్లో సందడి

బ్రహ్మోత్సవాలకు వలస వాసులు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. స్థానికులేకాక గుంటూరు, విజయవాడ, ఒంగోలు, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలివచ్చారు. బంధుమిత్రులతో గ్రామాలు కళకళలాడాయి.

'మద్దతు' చాలదు !

- పెంచాలని రైతుల డిమాండ్
- క్వింటా ధాన్యం రూ.2,300లకు పెంపు
- గత ఏడాది కంటే రూ. 117 అదనం
- అయినా గిట్టుబాటు కాదంటున్న అన్నదాతలు
- రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 బోనస్‌గా ప్రకటించాలంటున్న కర్షకులు



లారీకి ధాన్యం లోడ్ చేస్తున్న కూలీలు(ఫైల్)

సంగం, జూన్ 23: రైతులు పండించే వివిధ పంటలకు కేంద్ర ప్రభుత్వం గత వారంలో మద్దతు ధరలను ప్రకటించింది. గతేడాది క్వింటా ధాన్యం మద్దతు ధర రూ. 2,183గా ఉండగా ఈ ఏడాది అదనంగా రూ. 117 పెంచి రూ. 2,300గా ప్రకటించింది. పెంచిన ధరలతో పోలిస్తే ఈసారి సాగు ఖర్చులు విపరీతంగా పెరిగినా, సాధారణంగానే మద్దతు ధరలు పెంచారని రైతులు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వివిధ పంటల సాగుకు ఖర్చులు రెట్టింపైనా, దిగుబడులు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బోనస్‌గా మరికొంత మొత్తాన్ని పెంచాలని వారు కోరుతున్నారు.ఇందుకు ప్రధాన కారణం గతేడాది ప్రకటించిన మద్దతు ధర కంటే ఈ ఏడాది ప్రకటించిన మద్దతు ధర తక్కువ కావడమే. 2023-24 సీజన్‌లో రూ. 143 పెంచారు. దీంతో రూ. 2040 ఉన్న క్వింటా ధాన్యం రూ. 2,183కి పెరిగింది. ఈ ఏడాది రూ. 117 పెంచారు. అంటే క్వింటాకి రూ. 26లు తగ్గింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 50 బోనస్ రూపంలో పెంచాలని కర్షకులు కోరుతున్నారు.

2024- 25 ఏడాదికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు

పంట	గతేడాది ధర	ఈ ఏడాది ధర	పెరుగుదల
వరి సాధారణ	2,183	2,300	117
వరి ఏ- గ్రేడ్	2,203	2,320	117
పత్తి	6,620	7,121	501
మొక్కజొన్న	2,090	2,225	135
నువ్వులు	8,835	9,287	632
వేరుశనగ	6,377	6,783	406
రాగులు	3,846	4,290	444
మినుములు	6,950	7,400	450
పెసలు	8,558	8,682	124
కందులు	7,000	7,550	550

● జిల్లాలో వరి సాగే ప్రధానం

ఉమ్మడి నెల్లూరుజిల్లాలో ఉన్న సోమశిల, కండలేరు జలాశయాలు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లతోపాటు చెరువులు, బోరు పాయింట్ ద్వారా సాగు చేస్తున్న పంటల్లో వరి ప్రధానమైనది. అత్యధిక సంఖ్యలో రైతులు వరిపైనే ఆధార పడి జీవిస్తున్నారు. తరువాత ఉద్యానతోటలతోపాటు, వాణిజ్య పంటలైన మినుము, పెసర, పత్తి, వేరుశనగ వంటి పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎకరా వరి సాగుకు రూ. 30 నుంచి రూ.35 వేలు పెట్టుబడి అవుతుందని, అయినా దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. చేతకందిన పంటను అమ్ముకుందామంటే ఆ స్థాయిలో మద్దతు ధర పెరగడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పెంచిన ధర రూ. 117కు అదనంగా మరో రూ. 50 రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని రైతులు కోరుతున్నారు. అలాగే వరి ధాన్యంతోపాటు పత్తి, మొక్కజొన్న, మినుములు, పెసర, కందులు, నువ్వులు, వేరుశనగ, రాగులు తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించింది.

సమర్థతకు గుర్తింపు

- ఉమ్మడి నెల్లూరు జిల్లా పూర్వ కలెక్టర్లకు కీలక పోస్టింగ్‌లు
- వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శిగా బుడితి రాజశేఖర్
- సీఎంవోలో రవిచంద్రకు బాధ్యతలు
- ఆర్థికశాఖ కార్యదర్శిగా జానకి
- పోలా భాస్కర్‌కు ఉన్నత విద్యాశాఖలో పదవి



రాజశేఖర్



రవిచంద్ర



జానకి



పోలా భాస్కర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 23: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కలెక్టర్లుగా పనిచేసిన పలువురు రాష్ట్రస్థాయిలో కీలక పదవుల్లో నియమితుల య్యారు. వారంతా ముక్కుసూటిగా వ్యవహరించటమేకాకుండా, జిల్లా అభివృద్ధికి ఎంతగానో శ్రమించారు. ప్రజల కోసం పనిచేసి వారి మన్ననలు పొందారు. జిల్లా కలెక్టర్లుగా బుడితి రాజశేఖర్, ముద్దాడ రవిచంద్ర, ఎం. జానకి పనిచేశారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా పోలా భాస్కర్ పనిచేశారు. వీరంతా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాలో మంచి గుర్తింపు పొందారు.

● బుడితి రాజశేఖర్

బుడితి రాజశేఖర్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 86వ కలెక్టర్‌గా పనిచేశారు. ఈయన 1992వ బ్యాచ్ ఐఏఎస్‌కి చెం దినవారు. 2004 నుంచి 2005 వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి మంచి పేరు సంపాదించారు. ప్రజా సమస్యలు పరిష్కరిం చటంలో ప్రత్యేకత చాటుకున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు.

● ముద్దాడ రవిచంద్ర

ముద్దాడ రవిచంద్ర 1995వ బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన వారు. జిల్లాలో 87వ కలెక్టర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేవి. 2005 నుంచి 2008 వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రజా మన్ననలను పొందారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం ముఖ్యకార్య దర్శిగా నియమితుల య్యారు. అందరితో కలగలుపుగా ఉంటూ సమస్యలు తెలుసుకుని, పరిష్కరించే వ్యక్తిగా ఆయనకు పేరుంది.

● ఎం. జానకి

ఎం. జానకి 91వ కలెక్టర్‌గా జిల్లాలో పనిచేశారు. 2014 నుంచి 2016 వరకు సేవలందించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. స్పందన అర్జీల పరిష్కారంలో కూడా ఆమె తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. చంద్ర బాబు ప్రభుత్వంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

● పోలా భాస్కర్

పోలా భాస్కర్ డీఆర్వోగా పనిచేశారు. 2001-04 మధ్యకాలంలో ఇక్కడ కొనసాగారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించటమే కాక, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి అందరి మన్ననలు పొందారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం

రూ.కోట్లు విలువైన భూమిపై 'గోలీజు'!

- అనుమతుల్లేకుండా వైసీపీ కార్యాలయ నిర్మాణం
- ఇప్పటికే 80 శాతం పనుల పూర్తి
- ఏడాదిగా కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- తాజాగా వెలుగులోకి రావడంతో సంచలనం
- నోటీసులు అందజేసిన అధికారులు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జూన్ 23 : 'అధికారం చేతుల్లో ఉంది. ఇక మమ్మల్ని అడిగేవారెవరు!?' అన్న ధీమాతో నెల్లూరు నగరంలో రూ.కోట్లు విలువజేసే స్థలంపై వైసీపీ నాయకులు కన్నేశారు. 'లీజు' పేరు సదరు స్థలాన్ని చేజిక్కించుకుని ఏకంగా వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఇంత జరుగుతున్నా పాలక పెద్దల ఒత్తిళ్లు.. మరే కారణాలో తెలియవు కానీ అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. చివరకు ఫిర్యాదులు అందడంతో కార్పొరేషన్ అధికారులు సదరు భవనాన్ని పరిశీలించి, వైసీపీ జిల్లా అధ్యక్షుడికి నోటీసులు అందజేశారు.

నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం టిడ్కో ఇళ్ల కోసం భూమిని సేకరించారు. కొంత భూమిలో టిడ్కో ఇళ్లు నిర్మించగా, మిగిలిన భూమి ఖాళీగా ఉంది. అందులో రెండెకరాలను నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యాలయ నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించింది. అది కూడా 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చింది. ఎకరాకు ఏడాదికి రూ.1000 లీజు చొప్పున కేటాయించడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరం విలువ రూ.4 కోట్లు వరకు ఉంది. అంటే రూ.8 కోట్ల విలువ చేసే భూమిని వైసీపీ కార్యాలయానికి అతితక్కువ ధరకు ధారాదత్తం చేశారు. ఏడాది క్రితం పనులు ప్రారంభమవగా ఇప్పటికి 80 శాతం వరకు నిర్మాణం పూర్తయ్యింది. రూ.లక్షల పన్ను ఎగ్గొట్టి వైసీపీ పెద్దలు తమ పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. దీనిపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో శనివారం కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆ భవనం 1000 చ.మీ విస్తీర్ణం దాటడంతో నుడా అధికారుల అనుమతులపై ఆరా తీశారు. చివరకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. ఈ క్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నోటీసులు అందజేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. నుడా అధికారులు మాత్రం తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం.

● వారంలో వివరాలు ఇవ్వండి : కార్పొరేషన్ నోటీసులు

నెల్లూరు(సిటీ) : నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయానికి అనుమతి లేదనే ఆరోపణలు రావడంతో కార్పొరేషన్ అధికారులు ఆ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులు చూపాలంటూ వైసీపీ నాయకులకు మౌఖిక ఆదేశాలు ఇవ్వగా, స్పందన రాకపోవడంతో నోటీసు జారీ చేశారు. వారంలోగా తమకు అనుమతి పత్రాలు చూపాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఈ అంశంపై వైసీపీ నాయకుల్లో ఆందోళన కలిగిస్తున్నది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కందుకూరు, జూన్ 23: కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సబ్ కలెక్టరు పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను ఈ వేదికలో తెలియజేయవచ్చునని తెలిపారు. అలాగే కందుకూరు మండల స్థాయిలో తహసీల్దారు కార్యాలయంలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని మండలస్థాయి అధికారులంతా అక్కడ హాజరుకావాలని ఆమె తెలిపారు.

గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

కావలి, జూన్ 23 : రాష్ట్రంలో గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆమె తిరుమల నుంచి విజయవాడ వెళుతూ ఆదివారం సాయంత్రం మార్గమధ్యంలోని కావలిలో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూములో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆమెను కలిసి పుష్పగుచ్చం అందచేశారు. కావలి కేంద్రంగా గంజాయి ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందని, దానివలన ఇక్కడ యువత పెడదారి పడుతున్నారని, దానిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే అక్కడ ఉన్న పోలీస్ అధికారులతో దానిపై నిఘా పెట్టి నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చుదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితతో కావలి ఎమ్మెల్యే కావ్య, టీడీపీ నేతలు

తీరనున్న పేదవాడి ఆకలి

- అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై హర్షం
- వసతుల మెరుగునకు

రూ.10.8లక్షలతో ప్రతిపాదనలు

ఆత్మకూరు, జూన్ 23: అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతకం చేయగా.. క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లకు మంగళం పాడింది. అన్న క్యాంటీన్ల భవనాల రూపురేఖలు మారాయి. భవనాలకు రంగులు మార్చి కొన్నింటిని సచివాలయాల కింద మార్చి వేశారు. ప్రస్తుతం వాటి పునరుద్ధర ణకు అవ సరమైన నిధులు కోసం ప్రభుత్వా నికి ప్రతి పాదనలు సిద్ధం చేశారు. వాటిని సుందరంగా తీర్చిదిద్ది పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధం చేస్తుండటంతో నియోజకవర్గ పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూరులో ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్

వసతుల మెరుగునకు రూ.10.8 లక్షలతో ప్రతిపాదనలు

ఆత్మకూరు పట్టణంలోని పాత గవర్నమెంట్ హాస్పిటల్ ముందు గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని వాడుకలోకి తెచ్చేందుకు అధికారులు రూ.10.8లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. కుర్చీలు, రంగులు తదితర సౌకర్యాలతో వినయోగంలోకి తెచ్చేందుకు పనులు మొదలు పెట్టి రంగులు వేయించారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీకి దానిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లకు ఉన్న రంగులు మార్చేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పోనీ రంగులు మరిస్తే.. మార్చారు. వాటిని కొనసాగించి పేదలకు అన్నం పెట్టారా.. అంటే అదీ లేదు. రంగులకు పెట్టిన సొమ్ము తో అయిదేళ్ల పాటు మా కడుపు నింపె చ్చని పేదలు వైసీపీ ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా..

తెలుగుదేశం ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీడ కల్పించడమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేసింది. అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పట్టణ నడిబొడ్డు న ఉన్న మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్న కాంటీన్‌ను ఏర్పాటు చేశారు. వివిధ పనులపై వచ్చే వారు, పనిచేసే కార్మికులు, నిరుపేదలు ఆకలితో అమటించకుండా అన్న క్యాంటీన్‌కు వెళ్లి వారి కడుపు నిండా భోజనం చేసేవారు. ప్రతిరోజూ రెండు వేలమందికి పైగా మూడుపూటలా భోజనం చేసేవారు. నిర్విరామంగా నిరుపేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు అన్నివర్గాల మన్నన లను పొందింది. ఆసుపత్రులకు వచ్చే వారు, శ్రామికులు, నిరుపేదలు, చిన్న పనులు చేసుకునే వారితో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు అన్న క్యాంటీను సౌకర్యవంతంగా మారింది. ఈ రోజుల్లో ఎక్కడ భోజనం చేయాలన్నా కనీసం రూ.50 నుంచి రూ.60ల వరకు ఖర్చవుతుంది. అయితే అన్న క్యాంటీన్‌లో రూ.5లకే భోజనం పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత చంద్ర బాబుకే దక్కుతుందని చెబుతున్నారు.

అన్నారెడ్డిపాళెంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు బిందుమీనన్

సంగం, జూన్ 23: అన్నారెడ్డిపాళెంలో నెల్లూరు బిందు మీనన్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందు మీనన్ రోగులను పరీక్షించారు. అనంతరం పక్షవాత, మూర్ఛవ్యాధిపై అవగాహన కల్పించారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 23: కోలగట్ల సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన నాగవరపమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవరపమ్మ మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసిపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చించివేత

అనంతసాగరం, జూన్ 23: మండలంలోని వరికుంటపాడులో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు చింపేశారు. ఈ విషయంపై స్థానిక నేతలు పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఉదయగిరి, జూన్ 23: గన్నేపల్లి పంచాయతీలోని శ్రీఅడవిపేరంటాలమ్మ దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఎన్నికున్నారు. ఆలయ చైర్మన్‌గా పులిగుండ్ల రవీంద్ర, ఇతర కమిటీ సభ్యులను ఉన్నారు.

'అండగా ఉంటా'

ఉదయగిరి రూరల్, జూన్ 23: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నాయకులంతా సమష్టిగా ఉంటూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మోడి రామాంజనేయులు యాదవ్, గణపం బాలకృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ షేక్ అలీఅహ్మద్, చేజర్ల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 23: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ని ర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకట స్వామినా యుడు, ఆవుల రోశయ్య, షాజహాన్, జీ.వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొలువుల మహోత్సవం



వరికుంటపాడు: గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వరికుంటపాడు, జూన్ 20: గువ్వాడిలో రెండురోజుల నుంచి నిర్వహిస్తున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి కొలువుల మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా మహిళలు వారుకడవలతో నీరు పోసి కాయాకర్పూరం సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. అనంతరం పోతురాజుస్వామి బోనం, చాపకుల్లా బంతి, దీవెన బండారు కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కోటేశ్వరస్వామి కల్యాణం



సంగం: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, జూన్ 23: దువ్వూరు గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఉదయం కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ వేదిక మీదకు చేర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఈ వేడుక జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



గ్రామోత్సవంలో స్వామివారు

ఉదయగిరి రూరల్: కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కోదండరామస్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామోత్సవం, పారువేట, వసంతోత్సవ వేడుకలను భక్తులు నిర్వహించారు. అలాగే అనంతపూరిగంగాభవాని ఉత్సవాలు నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

పంపింగ్ స్కీం పైప్‌లైన్ల తనిఖీ



బెస్తకాలనీలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, జూన్ 23: స్థానిక గ్రామ పంచాయతీలోని డైరెక్ట్ పంపింగ్ స్కీంల పైప్‌లైన్లను ఆదివారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ సన్నపురెడ్డి భార్గవితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం బెస్త కాలనీ, తోటకాలనీ, రజక కాలనీ, కోట వీధి, పడమటి వీధుల్లో నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను పరిశీలించారు. లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు తాగు నీటిని వేడి చేసి వడగట్టి తాగాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీరు వీధుల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వెంగమాంబ సన్నిధిలో కాకర్ల కుటుంబం



మాజీ చైర్మన్ కరుణాకర్‌బాబుతో కాకర్ల కుటుంబ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 23: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల వెంకట్, రుక్మిణి, ఎమ్మెల్యే కార్యాలయ మేనేజర్ మాలేపాటి చైతన్య, పద్మజ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మాజీ చైర్మన్ పచ్చవ కరుణా కర్‌బాబు, ఆలయ కార్య నిర్వహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీలతో చర్చించారు. వారివెంట మల్లంపాటి గురవయ్య నాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, నాగిరెడ్డి, చీదర్ల మల్లికార్జున ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలువాయి, జూన్ 23 : మండలకేంద్రంతో పాటు చింతలాత్మకూరు, కుల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిస్కం గూడూరు ఏడీ రవికుమార్ తెలిపారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్లు వెంబడి చెట్లుకొమ్మలు తొలగిస్తున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్: గండిపాళెం మేడిద రమేష్ కుమార్తె నిఖిత ఇంటర్ చదువుకు గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్టు అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.20వేలను ఆదివారం తన ప్రతినిధుల కుటుంబసభ్యులకు అందజేశారు. నిఖిత ఫీజుల చెల్లింపు విషయమై తల్లిదండ్రులు ట్రస్టు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు కిరణ్, వెంకటయ్య పాల్గొన్నారు.



ఆలయంలో నిర్వహించిన హోమం



విద్యుత్ దీపాలంకరణలో వెంగమాంబ ఆలయం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దూరప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. క్యూ లైన్లలో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు పెడుతున్న మహిళలు



వెంగమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

- పూడిక తీయకపోవడంతో రోడ్లపైకి చేరుతున్న మురుగు
- అవస్థల్లో కావలి పట్టణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కావలి, జూన్ 23: కావలి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు సక్రమంగా నిర్మాణం లేకపోవడం, ఉన్న కాలువలలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైన పారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అవస్థలు పడుతున్న ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కావలి మున్సిపాల్టీలో జీతాలు తీసుకునే సిబ్బంది ఎక్కువగా ఉన్నా పనులు చేసే వారు చాలా తక్కువగా ఉన్నారు. దీంతో డ్రైనేజీలలో పూడికతీత సకాలంలో తీయకపోవడం, అనేక చోట్ల కాలువలపై ఉన్న మూత బండలు పూడికతీతకు ఆటంకంగా ఉండడంతో కార్మికులు పూడిక సక్రమంగా తీయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల కాలువలు పొంగి మురుగు రోడ్లపైన పారుతోంది. దీనిపై ఏ ప్రాంతంలోనైనా ప్రజలు ఫిర్యాదులు చేస్తే అక్కడ కాలువల్లో పూడికతీస్తున్నారు. ఈక్రమంలో అనేక చోట్ల రోడ్లపై మురుగు నీరు పారి అపరిశుభ్రంగా తయారవడమేకాక దాని వలన రోగాలు వచ్చే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పట్టణంలోని సినిమాహాల్ రోడ్డు నుంచి వడ్డిపాలెం వెళ్లే రోడ్డులో డ్రైనేజీ నిండి ఆ నీరంతా రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో వినాయకగుడికి వెళ్లే మార్గంలో డ్రైనేజీ నిండి నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాతూరులో కూడా అనేక చోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి అక్కడ పందులు చేరి అపరిశుభ్రంగా తయారవుతోంది. ఇలా పట్టణంలో అనేక చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైనా అధికారులు దానిపై తగిన శ్రద్ధ చేపట్టడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయించి రోడ్లపైకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సినిమా హాలు రోడ్డులో నిలిచిన మురుగు నీరు



వడ్డిపాలెం వెళ్లే మార్గంలో రోడ్డుపై పారుతున్న నీరు



బీకేనగర్‌లో రోడ్డుపైకి చేరిన మురుగు

కందుకూరులో త్వరలో ప్రజాదర్బార్

- 6 నెలల్లో మున్సిపల్ ఎన్నికలు
- త్వరలోనే ప్రకాశం జిల్లాలోకి..
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

కందుకూరు, జూన్ 23: రాష్ట్ర ఐటీశాఖామంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఆయన మంగళగిరిలో నిర్వహిస్తున్న తీరుగానే కందుకూరులోనూ త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు ప్రకటించారు. బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా జనార్ధన స్వామి ఆలయం వరకు పూర్ణకుంభ స్వాగతంతో తీసుకెళ్లి ఆలయంలో ఇంటూరి దంపతులకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జనార్ధన స్వామి ఆలయం నూతన కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించి అన్ని ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీకి పాలకవర్గం ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని, 15 ఏళ్లుగా ఇక్కడ కౌన్సిల్ లేనందున అనేక సమస్యలు ఉన్నాయని, 6 నెలల్లో కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగేలా మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ సహకారంతో అడ్డంకులు తొలగింపచేస్తానన్నారు. కందుకూరు పట్టణ ప్రజలు ఆందోళనలు చెందేలా చిన్న సంఘటన కూడా కందుకూరులో జరగకుండా ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియ కూడా ఆరు నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. గత ఎన్నికల్లో బ్రాహ్మణ సోదరులంతా తనకు ఎంతగానో సహకరించారని, వారందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. కార్యక్రమంలో గుడ్లూరి వెంకన్నకవి రాసిన సన్మానపత్రాన్ని చదివి సమర్పించారు. మంచిరాజు మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయత్రీ రామకృష్ణ, పెట్లూరి సుబ్బారావు, శ్రీరామగిరి శ్రీరామచంద్రమూర్తి, నందనవనం రామ సుబ్బారావు, ఇప్పగుంట మాధవరావు, నాగరాజారావు, రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్‌వీ), పవని నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇకపై 'ప్రజా ఫిర్యాదుల పరిష్కారం'

ఉలవపాడు, జూన్ 23 : ఇకపై ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు ఏవీవీ చంద్రారెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన బాధితుల అర్జీలు స్వీకరించి పరిష్కారం కొరకు ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణయించిన కాల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



కేన్సర్ బాధితుడికి నగదు అందిస్తున్న ప్రసాదరావు, శానం హరి

కావలిటౌన్, జూన్ 23: పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన వెంకటశేషయ్య కేన్సర్‌తో బాధపడుతుండగా సంయుక్త సేవాసంస్థ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ.10,000లను ఆదివారం సంస్థ సభ్యులు ప్రసాదరావు, శానం హరిలు బాధితుడి నివాసానికి వెళ్లి అందజేశారు. వారు మాట్లాడుతూ పేదవాడైన వెంకటశేషయ్య రూ.3 లక్షలు అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి శేషయ్యకు ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

బేతనీపేట కాలువల్లో పూడికతీత

బిట్రగుంట, జూన్ 23: బోగోలు పంచాయతీ బేతనీపేటలోని రైల్వే ప్రధాన కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కలు తీసే కార్యక్రమానికి ఆదివారం టీడీపీ మండల యువత సభ్యుడు గోచిపాతల సంజయ్ తన సొంత నిధులతో ప్రారంభించారు. కాలువ శిథిలావస్థకు చేరినా రైల్వే, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పందులు, దోమలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గెలుపుతో బేతనీపేటలో అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గంగపట్ల సురేష్, స్థానిక యువత ఎండ్లూరి ఫిలోమెన్, గుంటగాని రాజా, గోసాల శ్యామ్, జయానందం, పులివెందల వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల మెగా రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కావలిటౌన్, జూన్ 23: ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకుడు దివంగత తారకనాథ్ వర్ధంతి సందర్భంగా ఎస్‌బీఐ ఉద్యోగులు ఆదివారం రక్తదానం చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ గోర్ల శివకుమార్‌లు ప్రారంభించారు. ముందుగా తారకనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ రక్తనిధిలో సేవలందిస్తున్న డాక్టర్ రమ్య, నాగమణిలను సత్కరించారు. రెడ్‌క్రాస్ వైద్యాధికారి డాక్టర్ బెజవాడ రవికుమార్ రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ నాయకులు వీవీ ప్రసాద్, సనత్‌కుమార్, కె శ్రీనివాసులురెడ్డి, భువనేశ్వరి, టౌన్ బ్రాంచ్ మేనేజర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కోదండరాముడి కల్యాణం



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కావలి రూరల్, జూన్ 23 : కావలి మండలం చౌదరిపాలెంలోని కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం కోదండరామస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో ముస్తాబు చేసి దేవతామూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారికి గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



కావలిటౌన్ : ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నేతలు



బిట్రగుంట : నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, జూన్ 23: ఏకాత్మతా మానవతావాద సిద్ధాంతకర్త, భారతీయ జనతాపార్టీ ఆద్యుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కందుకూరులో బీజేపీ నేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వే సి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రామయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, చుండి ము రళీధర్, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, చిన్ని పాం దురంగయ్య, జాలరాఘవులు, మువ్వల భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంత రం బలిదాన్ దివస్ పురస్కరించుకుని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో మొక్క లు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింతా వెంకటరంగా రెడ్డి, నేతలు సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మంద కిరణ్, పూనూరు మాధవి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : బీజేపీ నేతల నివాళి

బిట్రగుంట : దేశ సమైక్యతకు ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బోగోలు బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, నాయకులు ప్రసాద్ రావు, గుర్రం వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, వెంకటక్రిష్ణ యాదవ్, పసుపులేటి సూర్యం, రావి తేజ, ఎస్.వెంకటేశ్వర్లు, గుత్తి సుధాకర్, ఆవుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.